తెలుగు దినపత్రిక
# సిరి
People's Voice వార్త పత్రిక
RNI TG TEL/ 26/A0381
05-07-2026
ఆదివారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 147
PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక
సిరి People's Voice వార్తపత్రిక
www.siridaily.com
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
epaper.siridaily.com
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575

# సబ్సిడీ యూరియా పక్కదారి..!



- ఒకవైపు రైతుల తిప్పలు.. మరోవైపు డీలర్ల బరితెగింపు
- చేర్యాల సంఘటనతో బయటపడ్డ వ్యవసాయ శాఖ నిర్లక్ష్యం
- సబ్సిడీ యూరియాను దర్జాగా పారిశ్రామిక రంగానికి అమ్ముతున్న ముఠాలు
- రూ. కోటి విలువైన 6,429 యూరియా బస్తాలు దారిమళ్లింపు
- ఆధార్ ఆధారిత యాప్, ఏఈఓల పర్యవేక్షణ ఉన్నా..
- 4 నెలలుగా నిరంతరాయంగా సాగిన అక్రమ దందా.
- తెలంగాణలో వ్యవసాయ శాఖ తీరుపై రైతుల నిరసన



**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**
పేద ప్రజల కోసం, అన్నదాతల కోసం ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా భారీగా సబ్సిడీలు ఇస్తూ నేరుగా ఫలాలు అందించడానికి కృషి చేస్తున్నాయి. అయితే, ప్రభుత్వ సబ్సిడీలను దర్జాగా దండుకు తినడానికి కొందరు అక్రమార్కులు నిరంతరం తమవంతు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. తాజాగా సిద్దిపేట జిల్లా చేర్యాలలో వెలుగుచూసిన ఘోర ఉదంతం.. రాష్ట్ర వ్యవసాయ శాఖలోని నిమ్మకు నీరెత్తినట్లున్న నిర్లక్ష్యానికి, పర్యవేక్షణా లోపానికి నిలువుటద్దంగా నిలిచింది. తెలంగాణవ్యాప్తంగా సామాన్య వ్యవసాయదారులకు చేరాల్సిన సబ్సిడీ యూరియా బస్తాలు..

మిగతా 2వ పేజీలో..



## నాడు మీరు నాటిన మొక్కే.. నేడు ముఖ్యమంత్రి

- 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని గుర్తు చేసుకున్న రేవంత్
- మిడ్జిల్‌ను దత్తత తీసుకోవాలని ప్రతిపాదన
- కేసీఆర్ పాలనపై విమర్శలు..
- 2034 వరకు కాంగ్రెస్ అధికారంలోనే ఉంటుందన్న ధీమా

**మిడ్జిల్, జూలై 4:**
ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి తన రాజకీయ ప్రస్థానం ప్రారంభమైన మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలానికి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అక్కడ నిర్వహించిన కృతజ్ఞత సభలో భావోద్వేగంగా ప్రసంగించారు. 2006 జూలైలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన తనను మిడ్జిల్ ప్రజలు గెలిపించి రాజకీయ జీవితానికి బలమైన పునాది వేశారని గుర్తు చేసుకున్నారు. ఆనాడు ప్రజలు నాటిన మొక్కే

మిగతా 2వ పేజీలో..

## ప్రజల కోసం నిరంతరం శ్రమించే నాయకుడు రేవంత్

- రేవంత్ రాజకీయ ప్రస్థానంపై భట్టి ప్రశంసలు

2

## బీఆర్ఎస్ తెచ్చిన అప్పు రూ.4,17,495 కోట్లు మాత్రమే



- దీనిపై ఎక్కడైనా చర్చకు సిద్ధం.. ఇదే మా స్టాండ్
- ఈ అప్పులతో బీఆర్ఎస్ ప్రభుత్వం ఆస్తులు, ఆదాయం పెంచింది
- డిప్యూటీ సీఎం చెప్పిన రూ.8,21,651 కోట్లు కట్టు కథ
- అప్పులపై రకరకాల లెక్కలు చెబుతున్న కాంగ్రెస్ నేతలు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీష్‌రావు విమర్శల దాడి

**హైదరాబాద్, జూలై 4 సిరి న్యూస్:**
భట్టి విక్రమార్క అప్పుల విషయంలో అబద్దాలు, అర్ధ సత్యాలు చెప్పి మసిబూసి మారేడు కాయ చేసే ప్రయత్నం చేసిండు.. ఆయనకు అప్పుల విషయంలో వాస్తవాలు తెలియవు అని నేను అనుకోను.. తెలిసి కూడా రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించారు.. లేని అప్పులను ఉన్నట్లుగా చూపి గోబెల్స్ ప్రచారానికి పాల్పడ్డారని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఆయన శనివారం విలేకర్లతో మాట్లాడుతూ అప్పుల విషయంలో మంత్రి జూపల్లి సవాళ్లు చేసి తోక ముడిచిన తీరును యావత్ సమాజం చూసింది.. ఆ అవమానం నుంచి ఎలాగైనా బయటపడాలనే భావనతో,

మిగతా 3వ పేజీలో..

## అధికారగణం మొద్దునిద్రతో 'మణి'కొండ పగులుతోంది!

- జిలెటిన్ స్టిక్స్ తో నిబంధనలకు విరుద్ధంగా బ్లాస్టింగ్స్
- భయంకరమైన శబ్దాలు.. తట్టుకోలేకపోతున్న వృద్ధులు, చిన్నారులు
- ఫిర్యాదులందినా కన్నెత్తిచూడని మున్సిపల్ అధికారులు
- పేలుళ్ల ధాటికి కంపిస్తున్న అపార్టుమెంట్లు, గృహాలు
- 20 రోజులుగా అదే తంతు.. రాళ్ల తరలింపులోనే ప్రమాద హెచ్చరికలు

2






ప్రమాదరహిత విద్యుత్ సేవల లక్ష్యంగా

## టీజీఎస్పీడీసీఎల్ 'సురక్ష 2026'

- జూలై 11న సేఫ్టీ ఎక్స్‌పో అండ్ వర్క్‌షాప్
- విద్యుత్ ఉద్యోగులు, వినియోగదారుల భద్రతే పరమావధి
- హైదరాబాద్ మింట్ కాంపౌండ్‌లో కార్యక్రమం
- భద్రతా రంగ నిపుణులు, పరికరాల తయారీదారులు పాల్గొనాలని యాజమాన్యం పిలుపు

3

## అభివృద్ధి కార్యక్రమాల్లో వేగం పెంచాలి

- 'క్యూర్' పరిధిలో అర్బన్ హౌసింగ్‌కు అత్యంత ప్రాధాన్యత
- రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలకు ఆధునిక శాశ్వత భవనాలు
- అధికార యంత్రాంగానికి మంత్రి పొంగులేటి దిశానిర్దేశం

3





## కల్తీ ఆహార మాఫియాపై ఉక్కుపాదం

- 100 రోజుల్లో 185 కేసులు నమోదు
- 121 టన్నుల కల్తీ ఆహార పదార్థాల స్వాధీనం

3

## తొలి రోజు మంచులింగం దర్శించుకున్న 12 వేల మంది భక్తులు

**జమ్ము, జులై 4 సిరి న్యూస్:**
కట్టుదిట్టమైన భద్రత, వాతావరణ అవాంతరాల మధ్య హర హర మహాదేవ్ అంటూ బయల్దేరిన భక్తులకు ఈ ఏడాది అమరనాథ్ మంచుశివలింగ తొలి దర్శనమైంది. అమరనాథ్‌యాత్రలో భాగంగా శుక్రవారం తొలిరోజు 12 వేల మంది భక్తులు మంచులింగాన్ని దర్శించుకున్నారు. జమ్ముూకశ్మీర్‌లోని హిమాలయాల్లో ఏటా ఈ సమయంలో ఏర్పడే మంచు లింగాన్ని పూజించేందుకు గురు, శుక్రవారాల్లో నువ్వాన్, బాల్‌టాల్ బేస్ క్యాంపుల నుంచి రెండు బృందాలు బయలుదేరాయి. శుక్రవారం దర్శనం చేసుకున్నవారిలో 9,350 మంది పురుషులు, 2,250 మంది మహిళలు, 200 మంది పిల్లలు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.





## ఆగ్రాలో 'దృశ్యం' సీన్ రిపీట్..!

- భర్తను చంపి బాత్రూంలో పాతిపెట్టిన భార్య
- పాయసంలో మత్తుమందు కలిపి ఘాతుకం
- భర్త కనిపించడంలేదంటూ పోలీసులకు ఫిర్యాదు
- 45 రోజుల తర్వాత వెలుగులోకి దారుణ హత్యోదంతం

2

## కవితకు ఎన్నికల సంఘం షాక్

- టిఆర్ఎస్ పేరు మార్చుకోవాలని నోటీస్
- అలాంటి ప్రసక్తి లేదంటూ స్పష్టం చేసిన కవిత
- అవసరమైతే సుప్రీం కోర్టును ఆశ్రయిస్తామని వెల్లడి

**హైదరాబాద్, జులై 4:**
కల్వకుంట్ల కవిత స్థాపించిన తెలంగాణ రక్షణ సేన(టీఆర్ఎస్) పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం

మిగతా 2వ పేజీలో..




## నిలోఫర్‌లో పసికందును వదిలేసిన తల్లిదండ్రులు

**హైదరాబాద్, జులై 4 సిరి న్యూస్:**
అనారోగ్యంతో బాధపడుతున్న రోజుల పసికందును తల్లిదండ్రులు నిర్దయగా వదిలేసి వెళ్లిపోయారు. ఈ దారుణ ఘటన నగరంలోని నాంపల్లి నీలోఫర్ హాస్పిటల్‌లో చోటు

మిగతా 3వ పేజీలో..





# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు

- **సీఎంను కలిసిన పలువురు మంత్రులు**

**హైదరాబాద్, జూలై 4 సిరి న్యూస్:**

ప్రజా జీవితంలో విజయవంతంగా 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, రాష్ట్ర మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరిలు ఆయన నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాం క్షలు తెలిపారు. ప్రజా సేవ పట్ల ఆయన చూపుతున్న అంకితభావం, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సాగిస్తున్న పాలన మరింత విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. పాలమూరు జిల్లా మిడ్జిల్ జెడ్పీటీసీగా ప్రారంభమైన రేవంత్ రెడ్డి రాజకీయ ప్రస్థానం నేడు ముఖ్యమంత్రి స్థాయికి చేరుకోవడం ఆయన పట్టుదల, ప్రజల పట్ల నిబద్ధత, నిరంతర కృషికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రతి పదవిని ప్రజా సేవకు వేదికగా మలుచుకుంట ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకున్న నాయకుడిగా ఆయన ఎదిగారని కొనియాడారు. ప్రస్తుతం ముఖ్యమంత్రిగా రాష్ట్ర అభివృద్ధి, సామాజిక న్యాయం, సంక్షేమం అనే మూడు ప్రధాన లక్ష్యాలతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, పేదలు, ఆదివాసి గిరిజనులు, బలహీన, అణగారిన వర్గాల సంక్షేమాన్ని కేంద్ర బిందువుగా చేసుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు రాష్ట్ర అభివృద్ధికి కొత్త దిశను నిర్దేశిస్తున్నాయని అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పారదర్శక పాలన అందిస్తూ సంక్షేమం, అభివృద్ధి రెండింటికీ సమాన ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకమని మంత్రులు అభిప్రాయపడ్డారు. ప్రజా జీవితంలో మరెన్నో విజయాలు సాధించి రాష్ట్రాన్ని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లాలని మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు.

# ప్రజల కోసం నిరంతరం శ్రమించే నాయకుడు రేవంత్

**మిడ్జిల్, జూలై 4 సిరి న్యూస్:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా మిడ్జిల్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడారు. రెండు దశాబ్దాల క్రితం జడ్పీటీసీగా ఆశీర్వదించిన ప్రజల వద్దకు నేడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా వచ్చి కృతజ్ఞతలు తెలపడం రేవంత్ రెడ్డి రాజకీయ సంస్కారానికి నిదర్శనమని కొనియాడారు. అధికారుల నివేదికలకే పరిమితం కాకుండా పేద ప్రజల కష్టాలను ప్రత్యక్షంగా తెలుసుకుని క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరువైన పాలన అందిస్తున్న నాయకుడు రేవంత్ రెడ్డేనని అన్నారు. ప్రజల సంక్షేమం కోసం ఆయన చేస్తున్న కృషికి ప్రకృతి కూడా సహకరిస్తోందని వ్యాఖ్యానించారు.

**సంక్షేమ పథకాలతో ప్రజలకు అండ**

రాష్ట్రంలో ఆకలి లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా కోటి 15 లక్షల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని భట్టి విక్రమార్క అన్నారు. అలాగే 27 లక్షల మంది విద్యార్థులకు పాఠశాలల్లో పౌష్టికాహారం అందించడం ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని చెప్పారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు, మహిళల ఆర్థిక స్వావలంబన కోసం వడ్డీ లేని రుణాలు అందిస్తూ ప్రజా సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

గత ప్రభుత్వ హయాంలో భయాందోళనల మధ్య జీవించిన తెలంగాణ ప్రజలకు ఇప్పుడు స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించిన నాయకుడు రేవంత్ రెడ్డేనని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ఇదే ప్రజల ఆశీర్వాదానికి కారణమవుతోందని అన్నారు.

# కవితకు ఎన్నికల సంఘం షాక్

**మొదటిపేజీ తరువాయి**

షాక్ ఇచ్చింది. కవిత కొత్త పార్టీ పేరును మార్చాలంటూ ఈసీ ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ రక్షణ సేన పేరుపై ప్రజల నుంచి అభ్యంతరాలు వెల్లువెత్తుతున్నాయని పేర్కొంది. 15 రోజుల్లో మూడు ప్రత్యామ్నాయ పేర్లు సమర్పించాలని ఆదేశించింది. లేని పక్షంలో దరఖాస్తును మూసివేస్తామని హెచ్చరించింది. టీఆర్ఎస్ పేరును కొనసాగించేందుకు వీల్లేదంటూ కవితకు ఈసీ లేఖ రాసింది. పేరు వివాదంతో కవిత కొత్త పార్టీ రిజిస్ట్రేషన్‌కు తీవ్ర అడ్డంకులు ఏర్పడ్డాయి. దీంతో కొత్త పేర్లతో దరఖాస్తును సవరించాలని ఈసీ సూచించింది. 'తెలంగాణ రక్షణ సేన' సంక్షిప్త నామంపై కేంద్ర ఎన్నికల సంఘం పంపిన లేఖ రాష్ట్ర రాజకీయాల్లో పెను దుమారం రేపుతోంది. కేంద్ర ఎన్నికల సంఘం లేఖ తమకు అందిందని, వారు లేవనెత్తిన రెండు ప్రధాన అభ్యంతరాలకు తాము ఇప్పటికే పూర్తిస్థాయిలో చట్టపరమైన సమాధానాలు ఇచ్చామని కవిత స్పష్టం చేశారు. తమ పార్టీ సంక్షిప్త నామం ఎప్పటికీ 'టిఆర్ఎస్ మాత్రమేనని తేల్చి చెప్పారు. కేంద్ర ఎన్నికల సంఘం సూచించినట్లు తాము కొత్త పేర్లు గానీ, ప్రత్యామ్నాయ సంక్షిప్త నామాలు గానీ ఇచ్చే ప్రసక్తే లేదని మీడియా ముఖంగా కుండబద్దలు కొట్టారు. ప్రజా క్షేత్రంలో ఇప్పటికే టిఆర్ఎస్ పేరుతో తాము దూసుకుపోతున్నామని, ఈ తరుణంలో వెనక్కితగ్గే ఆలోచన లేదని స్పష్టం చేశారు. ఒకవేళ ఈసీ తమ వివరణను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తే దీనిపై అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి న్యాయపోరాటం చేయడానికి కూడా తాము సిద్ధంగా ఉన్నామని ఆమె స్పష్టం చేశారు. పిలుపునిచ్చారు. గతంలో తన తండ్రి కేసీఆర్ నేతృత్వంలో కొనసాగిన పాత పేరును గుర్తుచేసేలా ఉండటంతో ఈ పేరు ప్రజల్లోకి వేగంగా దూసుకెళ్లింది. అయితే, టెక్నికల్ , లీగల్ అభ్యంతరాల నేపథ్యంలో ఈసీ నుంచి 15 రోజుల గడువుతో నోటీసులు రావడం, దానికి కవిత దీటుగా బదులివ్వడం రాష్ట్ర పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది.








# నాడు మీరు నాటిన మొక్కే.. నేడు ముఖ్యమంత్రి

**మొదటిపేజీ తరువాయి**

నేడు మహావృక్షమై ముఖ్యమంత్రిగా మీ ముందున్నానని అన్నారు. ఈ విజయం తనది కాదని, మిడ్జిల్ ప్రజలదేనని పేర్కొన్నారు. ఈ గడ్డ రుణం తీర్చుకోవడానికి తన ప్రాణం ఇచ్చినా తక్కువేనని వ్యాఖ్యానించారు.

**మిడ్జిల్ అభివృద్ధికి ప్రత్యేక దృష్టి**

ఒకప్పుడు చీకటి ప్రాంతాలుగా పేరున్న మిడ్జిల్, గట్టు ప్రాంతాల ప్రజలు మార్పు కోసం తీసుకున్న నిర్ణయమే తన రాజకీయ జీవితాన్ని మలిచిందన్నారు. మిడ్జిల్ మండలాన్ని జిల్లాకే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు దానిని దత్తత తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు సభ వేదికగా సూచించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహంతో పాటు మాజీ కేంద్ర మంత్రి జైపాల్ రెడ్డి ఎదుగుదలకు తోడ్పడిన ద్యాప గోపాల్ రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. జడ్పీటీసీ ఎన్నికల్లో తనపై గెలిచిన ప్రత్యర్థి రబ్బానీకి కూడా మంచి పదవి ఇచ్చి గౌరవించాలని సూచించారు.

**పాలమూరు బిడ్డకు పరిపాలన రాదా?**

నల్లమల ప్రాంతం నుంచి వచ్చిన తనకు పరిపాలన గురించి తెలియదంటూ కొందరు చేసిన విమర్శలను సీఎం తిప్పికొట్టారు. గ్రామాల సమస్యలు పరిష్కారమైతే రాష్ట్ర సమస్యలు తీరినట్లేనని చెప్పారు. గ్రామీణ ప్రాంత ప్రజల కష్టాలు తెలిసిన వ్యక్తిగా పరిపాలనపై పూర్తి అవగాహన ఉందన్నారు. "పరిపాలన చేయడానికి పాలమూరు బిడ్డ పనికిరాడా?" అంటూ ప్రశ్నించారు. కులగణన ద్వారా వందేళ్ల సమస్యకు తమ ప్రభుత్వం పరిష్కారం చూపిందని, సన్నబియ్యం పంపిణీ, రైతు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్న వడ్లకు బోనస్ వంటి హామీలను అమలు చేస్తున్నామని తెలిపారు.

**కేసీఆర్ పాలనపై విమర్శలు**

పదేళ్ల పాలనలో భారీ అప్పులు మిగిల్చి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని కేసీఆర్ ప్రభుత్వంపై రేవంత్ రెడ్డి విమర్శలు గుప్పించారు. ఇంటికో ఉద్యోగం, దళితులకు మూడెకరాల భూమి, డబుల్ బెడ్‌రూం ఇళ్లు వంటి హామీలు నెరవేర్చలేదని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు అవినీతికి పాల్పడిన వారే ఇప్పుడు మళ్లీ అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మహిళల గోప్యతను కూడా భంగం కలిగించే చర్యలకు పాల్పడ్డారని విమర్శించారు.

**2034 వరకు కాంగ్రెస్ ప్రభుత్వమే**

అసెంబ్లీకి దూరంగా ఉంటూ ఫామ్‌హౌస్‌కే పరిమితమైన కేసీఆర్ ఇక అధికారాన్ని మరిచిపోవాలని రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణలో 2034 వరకు కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీకి కృతజ్ఞతగా దేశంలో రాహుల్ గాంధీని ప్రధానిని చేసే దిశగా తెలంగాణ ప్రజలు ముందుండాలని, ఆ ఉద్యమానికి మిడ్జిల్ నుంచే శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు.

# సబ్సిడీ యూరియా పక్కదారి..!

**మొదటిపేజీ తరువాయి**

నిబంధనల రక్షణ వలయాన్ని దాటుకుని దర్జాగా నల్లబజారుకు తరలిపోతుండటం తీవ్ర కలకలం రేపుతోంది.

**రూ. కోటి విలువైన 6,429 బస్తాలు పారిశ్రామిక రంగానికి..!**

రైతులకు సబ్సిడీ ఎరువులు నేరుగా, పారదర్శకంగా అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఆధార్ ఆధారిత పంపిణీ వ్యవస్థను ఏర్పాటు చేసింది. ప్రత్యేక ఫర్టిలైజర్ యాప్ ద్వారా మాత్రమే రైతులు యూరియా కొనుగోలు చేయాలనే కఠిన నిబంధనలు పెట్టింది. యూరియా అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడానికే ఈ నిర్ణయం తీసుకున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో హోల్‌సేలర్, రిటైలర్ డీలర్లు చేతులు కలిపి ఈ వ్యవస్థకు ఘోరంగా చిల్లు పెట్టారు. చేర్యాల కేంద్రంగా మార్చి నెల నుండి దాదాపు 4 నెలల పాటు రైతుల పేరిట మంజూరైన 6,429 బస్తాల యూరియాను నేరుగా పరిశ్రమలకు అమ్మేసుకున్నారు. నల్ల బజారుకు తరలిన ఈ యూరియా బహిరంగ మార్కెట్ విలువ దాదాపు కోటి రూపాయల పైమాటే ఉంటుందని అంచనా వేస్తున్నారు.

**ఆధార్ కార్డులు, ఓటీపీల మాయాజాలం..**

రాష్ట్రవ్యాప్తంగా 6 వందల పైచిలుకు మండలాల్లో క్షేత్రస్థాయిలో రైతులకు సేవలందించేందుకు వ్యవసాయ విస్తరణ అధికారులు, ఉన్నతాధికారుల భారీ నెట్‌వర్క్ ఉంది. ఇంత పెద్ద పర్యవేక్షణా యంత్రాంగం కళ్లముందే నెలల తరబడి వేల బస్తాల యూరియా పక్కదారి పడుతున్నా ఒక్క అధికారి కూడా పసిగట్టలేకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఈ భారీ స్కామ్ బయటపడిన వెంటనే వ్యవసాయ శాఖ ఒక ఉన్నతాధికారిని సస్పెండ్ చేసి, సదరు డీలర్లపై కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంది. అయితే, ఈ దందాలో వందల సంఖ్యలో రైతుల ఆధార్ కార్డులను డీలర్లు ఎలా ఉపయోగించారు? పాయింట్ ఆఫ్ సేల్ మిషన్లలో బయోమెట్రిక్ వేలిముద్రలు లేదా ఓటీపీ లూప్‌హోల్స్‌ను ఎలా మేనేజ్ చేశారు? అనే ప్రశ్నలు ఇంకా మిస్టరీగానే మిగిలాయి. ఫర్టిలైజర్ యాప్ రాకముందు జరిగిన క్రయ విక్రయాల రిజిస్టర్లను గనుక లోతుగా పరిశీలిస్తే ఇలాంటి దారిమళ్లింపు సంఘటనలు రాష్ట్రవ్యాప్తంగా కోకొల్లలుగా బయటపడే అవకాశం ఉంది.

**పారిశ్రామిక అవసరాల కోసమే యూరియా దోపిడీ!**

సబ్సిడీ యూరియాకు పారిశ్రామిక రంగంలో ఉన్న విపరీతమైన మార్కెట్ డిమాండే డీలర్ల కక్కుర్తికి ప్రధాన కారణంగా మారుతోంది. ప్రస్తుతం హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కల జిల్లాల్లో రవాణా, లాజిస్టిక్స్ రంగాలు వేగంగా విస్తరిస్తుండటంతో.. సరికొత్త కాలుష్య నివారణ ప్రమాణాలు కలిగిన డీజిల్ వాహనాల కోసం 'డీఈఎఫ్' ఉత్పత్తికి పారిశ్రామిక స్థాయి యూరియా అత్యంత కీలకంగా మారింది. దీనికి తోడు, ప్లైవుడ్ మరియు పార్టికల్‌బోర్డ్ తయారీ పరిశ్రమలలో థర్మోసెట్టింగ్ రెసిన్‌లు, జిగురు తయారీకి యూరియాను ప్రధాన ముడిసరుకుగా వాడుతుంటారు. ఫర్నిచర్, నిర్మాణ రంగాలు విరివిగా ఉన్న ప్రాంతాల్లో ఇండస్ట్రియల్ యూరియా ధరలు ఆకాశాన్నంటుతుండటంతో.. ప్రభుత్వ రూ. 266 సబ్సిడీ బస్తాలను డీలర్లు దొంగదారిలో పరిశ్రమలకు అమ్మి లక్షల రూపాయలు వెనకేసుకుంటున్నారు.

**డీలర్ల గుప్పిట్లోనే వ్యవస్థ..**

తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాలలో ఇప్పటికీ ఎరువుల పంపిణీ వ్యవస్థ చాలావరకు స్థానిక డీలర్ల గుప్పిట్లోనే నడుస్తోంది. చిన్న, నిరక్షరాస్యులైన రైతులు తమకు కావలసినంత యూరియాను డీలర్లు ఎంత ఇస్తే అంతకే సరిపెట్టుకుంటున్నారు తప్ప, వాస్తవంగా తమ పేరిట ఎంత కోటా బుక్ అవుతుందో తెలుసుకోలేకపోతున్నారు. దీనివల్ల నూటికి తొంభై శాతం మంది సామాన్య రైతులకు న్యాయంగా అందాల్సిన సబ్సిడీ కోటా అందకుండా పోతోంది. ప్రభుత్వం ఆన్‌లైన్ విధానం తెచ్చినప్పటికీ, డీలర్లు ఆధార్ కంట్రోలింగ్ వ్యవస్థలతో ఈ లూప్‌హోల్స్‌ను వాడుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో డీలర్ల స్టాక్ రిజిస్టర్లపై, నిత్య అమ్మకాలపై వ్యవసాయ శాఖ అధికారుల ప్రత్యక్ష తనిఖీలు లేకపోవడమే ఈ దుస్థితికి కారణమని రైతులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కేవలం చేర్యాల ఘటనతో సరిపెట్టకుండా.. రాష్ట్రవ్యాప్తంగా యూరియా వాడుతున్న పరిశ్రమల ముడిసరుకు కొనుగోలు వివరాలపై, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలోని డీలర్ల అకౌంట్లపై సమగ్ర సిట్టింగ్ జడ్జితో లేదా ఉన్నత స్థాయి దర్యాప్తు జరిపించాలని తెలంగాణ రైతాంగం గట్టిగా డిమాండ్ చేస్తోంది.

# అధికారగణం మొద్దునిద్రతో 'మణి'కొండ పగులుతోంది!

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**

అది నగరంలో అత్యంత ఖరీదైన ప్రాంతం.. అంతే వేగంతో అభివృద్ధి చెందుతున్న ప్రాంతం కూడా. నిత్యం బ్యూరోక్రాట్లు, పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ పెద్దలు ప్రయాణించే ప్రాంతం కూడా. అక్కడ పట్టపగలే జిలెటిన్ స్టిక్స్ తో చేస్తున్న బ్లాస్టింగ్లు ఆ ప్రాంత ప్రజలకు సమస్యగా పరిణమించాయి. హైదరాబాద్ లో మణికొండ అంటే ఇప్పుడు అక్కడ నివాసమే ఒక ప్రత్యేకత. కానీ అక్కడ పట్టపగలే జరుగుతున్న పేలుళ్లను చూస్తే క్వారీల పక్కన నివాసం ఉంటున్న పరిస్థితి నెలకొంది. నార్సింగి సర్కిల్ మణికొండ డివిజన్ మర్రిచెట్టు సర్కిల్ సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న భారీ బ్లాస్టింగ్‌లు, అడ్డగోలు డ్రిల్లింగ్‌లు ప్రాంత ప్రజలకు వణుకు పుట్టిస్తున్నాయి. జలమండలి కార్యాలయం పక్కనే ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ సుమారు నాలుగు ఎకరాల విస్తీర్ణంలో గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్ నిర్మాణ పనులు చేపట్టింది. ఇందుకోసం కొన్ని రోజులుగా ఉదయం నుంచి సాయంత్రం వరకు రెండు, మూడు కంప్రెసర్లతో నిరంతరం డ్రిల్లింగ్ నిర్వహిస్తూ, జెలటిన్ స్టిక్స్‌తో భారీ పేలుళ్లకు పాల్పడుతున్నారు. దీనివల్ల సమీపంలోని ఇళ్లు, అపార్ట్‌మెంట్లు తీవ్రంగా కంపిస్తున్నాయి. ఇళ్లల్లోని వృద్ధులు, చిన్నారులు ఈ భయానక శబ్దాలకు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. ఈ అక్రమ తతంగంపై స్థానికులు పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. 20 రోజులుగా అదే తంతు నిరాటంకంగా సాగుతోంది.

**ఫిర్యాదులపై చర్యలు శూన్యం..**

నిర్మాణంలో ఉన్న గేటెడ్ కమ్యూనిటీలో బండ రాళ్లను పగలగొట్టేందుకు నిత్యం జిలెటెన్ స్టిక్స్‌తో బ్లాస్టింగ్ జరుపుతున్నారని, భారీ పేలుళ్ల మూలంగా ఇళ్లు కంపిస్తున్నాయని స్థానికులు ఫిర్యాదులు చేశారు. అయితే అధికారులు తనిఖీకి ఇలా వచ్చి అలా వెళ్తుండటంతో నిర్మాణ సంస్థకు వారే పరోక్షంగా సహకరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల ఈ మొద్దునిద్ర వైఖరి వల్లే మణికొండ ప్రాంతం పేలుళ్లతో పగులుతోందని, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**రక్షణ లేకుండా రాళ్ల తరలింపు**

ఇదిలాఉంటే బ్లాస్టింగ్ చేస్తూ తొలగిస్తున్న బండ రాళ్లను రక్షణ చర్యలు లేకుండా తరలిస్తున్నారు. పది టిప్పర్లలో వీటిని తరలిస్తుండగా ఇందులో కొన్నిటికి నంబర్ ప్లేట్లు కూడా లేవు. ఒకవైపు బ్లాస్టింగ్లతో మణికొండ ప్రజలను బెంబేలెత్తిస్తున్న నిర్మాణ సంస్థ మరోవైపు లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ ఉల్లంఘనలు చేస్తున్నా పోలీసులు సైతం విస్మరించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై ప్రమాదకరంగా వెళ్తున్న ఈ వాహనాలతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాళ్ల తరలింపులోనే స్పష్టమైన ప్రమాద హెచ్చరికలు కనిపిస్తున్నా నివారణ చర్యలు శూన్యంగా మారాయి.

**అందుబాటులో లేని డీసీ**

ఈ వ్యవహారంపై వివరణ కోరేందుకు నార్సింగి



డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డికి పలుమార్లు ఫోన్ చేసినా ఆయన నుంచి ఎలాంటి స్పందన రాలేదు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ప్రజల సమస్యలపై స్పందించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ఒక నిర్మాణ సంస్థ స్వార్థం మూలంగా నిత్యం వేలాది మంది ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు త్వరితగతిన శాశ్వత పరిష్కారం చూపాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# ఆగ్రాలో 'దృశ్యం' సీన్ రిపీట్..!

- **భర్తను చంపి బాత్రూంలో పాతిపెట్టిన భార్య**
- **పాయసంలో మత్తుమందు కలిపి ఘాతుకం**
- **భర్త కనిపించడంలేదంటూ పోలీసులకు ఫిర్యాదు**
- **అనుమానంతో విచారిస్తే బయటపడ్డ వాస్తవం**
- **45 రోజుల తర్వాత వెలుగులోకి దారుణ హత్యోదంతం**

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**

ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఆగ్రాలో దృశ్యం సినిమాను తలపించేలా ఒక భార్య తన భర్తను అతి కిరాతకంగా హతమార్చిన ఘటన వెలుగుచూసింది. వ్యసనాలకు బానిసైన తన భర్తతో తరచూ గొడవలు పడుతున్న భార్య, పక్కా ప్లాన్ ప్రకారం అతడిని అంతమొందించి, సాక్ష్యాలు దొరకకుండా బాత్రూంలో పాతిపెట్టింది. రాజస్థాన్‌కు చెందిన సురేందర్ శర్మ తన కుటుంబంతో కలిసి ఆగ్రాలో నివాసం ఉంటున్నాడు. మే 17వ తేదీ రాత్రి తన భార్య రూబీతో సురేందర్‌కు మరోసారి గొడవ జరిగింది. ఆ గొడవతో విసిగిపోయిన రూబీ, తన భర్తకు ఇష్టమైన పాయసంలో ఏకంగా 16 నిద్రమాత్రలు కలిపి ఇచ్చింది. దీంతో అతను మత్తులోకి జారుకోగా, వెంటనే అతడిని హతమార్చింది. అప్పటికే పక్కా పథకం ప్రకారం, ఇంట్లో ఎవరూ లేని సమయంలో మృతదేహాన్ని బాత్రూంలో పాతిపెట్టి, ఎవరికీ అనుమానం రాకుండా పైన కొత్తగా టైల్స్ వేయించింది. భర్త చనిపోయిన తర్వాత, సురేందర్ గొడవ పడి డబ్బులు తీసుకుని బయటకు వెళ్ళాడని అందరినీ నమ్మించింది. అంతేకాకుండా, మే 26న పోలీసులకు భర్త కనిపించడం లేదంటూ ఫిర్యాదు కూడా చేసింది. అయితే, రూబీపై అనుమానం వచ్చిన బంధువులు పోలీసులకు సమాచారం అందించడంతో, పోలీసులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. పోలీసుల కఠిన విచారణలో తన తప్పును రూబీ ఒప్పుకుంది. ఆమె ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, బాత్రూంలోని టైల్స్‌ను తొలగించి మృతదేహాన్ని వెలికితీశారు. మృతదేహం పాతిపెట్టిన విధానం గురించి పోలీసులు అడిగిన ప్రశ్నలకు ఆమె ఏమాత్రం





తడుముకోకుండా సమాధానాలు చెప్పడం చూసి పోలీసులే విస్తుపోయారు. ప్రస్తుతం నిందితురాలిని అదుపులోకి తీసుకున్న పోలీసులు, ఈ హత్యలో ఆమెకు ఎవరైనా సహకరించారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# బీఆర్ఎస్ తెచ్చిన అప్పు రూ.4,17,495 కోట్లు మాత్రమే

మొదటిపేజీ తరువాయి



ఆత్మరక్షణలో భాగంగా భట్టి అప్పులపై తప్పుడు లెక్కలు వండి వార్చారన్నారు. మేం అప్పుల విషయంలో క్లిస్టర్ క్లియర్ గా ఉన్నం.. ఈరోజు మళ్లీ ఒకసారి భట్టి, రేవంత్ రెడ్డికి, మంత్రులందరికి, ప్రజలందరికీ ఆధారాలతో అప్పుల విషయంలో స్పష్టత ఇవ్వదలుచుకున్నాను. మేనిఫెస్టోలో మీరు ప్రజలకు ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయడం లేదు? అప్పులు అప్పులు అంటూ ఎందుకు కుంటి సాకులు, సొల్లు పురాణం చెబుతున్నరు అని ప్రశ్నించారు. కరోనా వచ్చి ఎకానమీ డౌన్ అయినా కేసీఆర్ హయాంలో ఏనాడూ రాష్ట్రం దివాలా తీసింది అనలేదు.. మరి ఇప్పుడు కరోనా లేదు.. పెద్ద నోట్ల రద్దు లేదు.. మీ ముఖ్యమంత్రి ఎందుకు దివాలా అని మాట్లాడుతున్నరు? అంటే పాలనలో మీ ముఖ్యమంత్రి, మీ ప్రభుత్వం అట్టర్ ఫ్లాప్ అయ్యారని ఒప్పుకుంటున్నారా? మీ అపారమైన అనుభవం కమీషన్లు దండుకోవడానికి తప్ప రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగపడలేదు అని ధ్వజమెత్తారు. నిన్న భట్టి హడావుడిగా ప్రెస్ మీట్ పెట్టి అప్పుల విషయంలో అర్థరహితంగా మాట్లాడిండు.. రంకెలు వేసినంత మాత్రాన అంకెలు మారవు.. పదేళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పు రూ.8,21,651 కోట్లు అని మళ్లీ అదే కట్టుకథ చెప్పిండు అని అన్నారు. తెలంగాణ ఏర్పాటైన 2014 జూన్ 2 నాటికి రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్న ఎఫ్ఆర్బీఎం రుణాలు, ఎస్పీవీ గ్యారంటీ రుణాలు మొత్తం కలిపి రూ.84,268 కోట్లు బిఆర్ఎస్ ప్రభుత్వ ఖాతాలో చూపారు. 2023 డిసెంబర్ 7 నుంచి 2024 మార్చి 31 వరకు అంటే ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తీసుకున్న ఎఫ్ఆర్బీఎం రుణాలు రూ.15,118 కోట్లు. దీన్ని కూడా బిఆర్ఎస్ ప్రభుత్వ అప్పుల్లో కలిపారు. (ఆర్బీఐ రిపోర్టు ఆధారం) అంటే రూ.84,268 కోట్లు + రూ.15,118 కోట్లు = రూ.99,386 కోట్లు ఈ మొత్తాన్ని 2023 డిసెంబర్ 7 నాటికి ప్రభుత్వంపై ఉన్న మొత్తం బకాయి రుణాలు రూ.5,16,881 కోట్ల నుంచి తీసివేస్తే, రూ.4,17,495 కోట్లు. ఇదే నేను చెప్పిన లెక్క. మీ డాక్యుమెంట్ ప్రకారమే చెబుతున్నా? ఎన్ని కలిపినా వాళ్లు చెప్పిన 8,21,651 కోట్లు నిండటం లేదని అందులో ఏం ఏం కలిపారో మీరే చూడండి. ప్రభుత్వం గ్యారెంటీ ఉండి, కార్పోరేషన్లు చెల్లించేవి, ప్రభుత్వం గ్యారెంటీ లేకుండా కార్పోరేషన్లే చెల్లించేవి కలిపారు. నిజానికి ఈ రుణాలు వాటికవే చెల్లిస్తాయి. ఆర్బీఐ డాక్యుమెంట్ పబ్లిక్ డొమైన్ లోనే ఉంటది ఎవరైనా తెలంగాణ అప్పులు ఎంత తెచ్చిందో చూడొచ్చు. ఇది మాత్రమే కాదు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అప్పు గురించి కాగ్ రిపోర్టు కుండబద్దలు కొట్టినట్లు చెప్పింది. 2024 మార్చి నాటికి ప్రభుత్వమే చెల్లించే ఆఫ్ బడ్జెట్ బారోయింగ్స్ 1,20,944 కోట్లు. ఇందులో భట్టి చెప్పిన డాక్యుమెంట్ లో 2014, జూన్ 2నాటికి ఉన్న ప్రభుత్వం చెల్లించే ఆఫ్ బడ్జెట్ బారోయింగ్స్ రూ.11,609 కోట్లు తీస్తే 1,09,335 కోట్లు ఉంటుంది. తెలంగాణ బడ్జెట్ ఇన్ బ్రీఫ్ 2025-26, 14వ పేజీలో చెప్పిన దాని ప్రకారం బిఆర్ఎస్ ప్రభుత్వం ఎఫ్ఆర్బీఎం పరిధిలో తీసుకున్న రుణాలు 3,01,484 కోట్లు. అంటే 3,01,484 కోట్లు + 1,09,335 కోట్లు = 4,10,819 కోట్లు. ఇది మేము చెబుతున్న లెక్క కాదు 'కాగ్' చెబుతున్న లెక్క. మిషన్ భగీరథ, కాళేశ్వరం, సీతారామ, స్కీలకు సంబంధించి బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పు అక్షరాల 4,10,819 కోట్లు అని 'కాగ్' స్పష్టం చేసింది. ఆ రిపోర్టు మీరు డిసెంబర్ 2023 వైట్ పేపర్ లో చెప్పిన ప్రకారం బిఆర్ఎస్ ప్రభుత్వ అప్పు 4.17లక్షల కోట్లు. ఇష్టం ఉన్నట్లు లెక్కలు కట్టి అప్పుల గురించి తప్పుడు ప్రచారం చేస్తున్న వాళ్లకు మళ్లీ చెబుతున్నా.. మీ శ్వేతపత్రం ప్రకారం చూసినా, బడ్జెట్ డాక్యుమెంట్స్ ప్రకారం చూసినా, కాగ్ రిపోర్టు ప్రకారం చూసినా, మీ ఎకనామిక్ సర్వే ప్రకారం చూసినా బిఆర్ఎస్ హయాంలో చేసిన 4.17లక్షల కోట్లు దాటలేదు. ఇది మా స్టాండ్ దీని మీద ఎక్కడ, ఎప్పుడు చర్చకైనా సిద్ధమని చెబుతున్నా.. బిఆర్ఎస్ ప్రభుత్వ అప్పులపై పూటకో మాట. వీళ్లు చెబుతున్న అప్పుల లెక్క మీద నిలబడతారా అంటే అదీ లేదు. పూటకో మాట, నచ్చినట్లు లెక్కలు మార్చుతూ, అబద్దాలు ప్రచారం చేస్తున్నరు. అసెంబ్లీలో విడుదల చేసిన శ్వేతపత్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పు 6,71,757 కోట్లు అని చెప్పారు. ఇందులో కూడా మాకు సంబంధం లేనివి కలిపారు. మొన్న జూపల్లి ఏమన్నరు, ముందు రోజు 8లక్షల కోట్ల అప్పు అన్నడు, తెల్లారి 7లక్షల కోట్ల అప్పు అన్నడు. శ్వేతపత్రంలో ఒక లెక్క, అసెంబ్లీలో ఒక లెక్క, పత్రికా సమావేశాల్లో ఒక లెక్క ఉంటదా? మీరు ఇచ్చిన హామీల నుంచి ప్రజల దృష్టిని మర్లించడం కోసం, మీరు చేస్తున్న స్కాంల నుంచి డైవర్షన్ చేయడం కోసం అప్పుల పేరుతో డ్రామాలు ఆడుతున్నరు. స్కాంలు బయట పడుతుంటే, ప్రజలు తిరగబడుతుంటే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నరు. 8.21 లక్షల కోట్ల అప్పు అనేది కట్టు కథ. వాళ్లు తెచ్చిన అప్పుల విషయంలోనూ తలో మాట. నిన్న భట్టి గారు లక్ష 77 వేల కోట్ల అప్పు తెచ్చినం అంటే.. 2026 మార్చి 18న అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన ఎఫ్ఆర్ బీఎంపాటు, అన్ని రకాల అప్పు ఫిబ్రవరి 28,2026 నాటికి చేసిన అప్పు కలిపి రూ.3,47,294 కోట్లు అని స్వయంగా ప్రకటించారు. నాలుగు నెల్లలో అప్పు ఎట్ల తగ్గింది రేవంత్ రెడ్డి, భట్టి గారు? ఇదంతా గారడీ కాదా? ప్రజలను మోసం చేయడం కాదా? ముఖ్యమంత్రి కరెక్టా? భట్టి కరెక్టా? జూన్ 30 నాటికి పబ్లిక్ డొమైన్ ఉన్న లెక్కల ప్రకారం 31 నెల్లలో రేవంత్ రెడ్డి చేసిన మొత్తం అప్పు నాలుగున్నర లక్షల 50వేల కోట్లు. లంచాలు ఇచ్చి తెస్తున్న అప్పులు. ఎంత దారుణం అంటే.. ఒక దిక్కు బిఆర్ఎస్ అప్పులు చేసింది అని దుష్ప్రచారం చేస్తూ వీళ్లు వేల కోట్ల అప్పులు దొంగదారిన లంచాలు ఇస్తూ తెస్తున్నరు. వీళ్ల బండారం మొత్తం అసెంబ్లీలో నేను అడిగిన ప్రశ్నతోనే బట్టబయలైంది. వేల కోట్ల రూపాయల అప్పులు ఎఫ్ఆర్ బిఎం పరిధిలోకి రాకుండా, వందల కోట్ల లంచాలు (బ్రోకర్ కమీషన్లు) ఇచ్చి తెస్తున్నరు. ప్రభుత్వమే అప్పుల కోసం బ్రోకర్లకు లంచాలు ఇచ్చే పరిస్థితికి దిగజారింది.. అందుకే రేవంత్ రెడ్డిని దొంగలాగా చూస్తున్నరు. దేశ చరిత్రలో ఇంత దిక్కుమాలిన పని చేసిన ప్రభుత్వం మరొకటి ఉండదు. టీజీఐఐసీ భూములను కుదువపెట్టి 10వేల కోట్ల అప్పు తేవడానికి ఇచ్చిన బ్రోకరేజ్ చార్జీ ఎంత అంటే వీళ్లు ఇచ్చిన సమాధానం.... 170 కోట్లు అదే అసెంబ్లీలో మరో ప్రశ్నకు అడిగినం... హెచ్ ఎండీఏ భూములు కుదువ పెట్టడం ద్వారా ఎంత అప్పు సేకరిచించాలనుకుం టున్నారు అని అడిగితే వచ్చిన సమాధానం.. మరో 20వేల కోట్లు అప్పు తెస్తాం అన్నరు. అంటే 10,000 కోట్ల అప్పుకు 170 కోట్లు బ్రోకర్ చార్జీ చెల్లిస్తే, మొత్తం 30 వేల కోట్లకు గాను బ్రోకర్లకు చెల్లిస్తున్న డబ్బు అక్షరాల రూ. 510 కోట్లు. దీన్ని బ్రోకరేజ్ అంటరా? లంచం అంటరా? ఏమంటరో ప్రభుత్వమే సమాధానం చెప్పాలె. ఇది మాత్రమే కాదు ఇట్లనే వందల కోట్ల లంచాలు ఇచ్చి... మూడు హైదరాబాద్ కార్పొరేషన్లు, డిస్కంలు, హెచ్ ఎండబ్ల్యుఎస్ ద్వారా మరో 70,000 కోట్ల అప్పు తేవాలని టార్గెట్ పెట్టుకున్నరు. అంటే ఈ 70వేల కోట్ల అప్పు కోసం రేవంత్ రెడ్డి బ్రోకర్లకు ఇచ్చే లంచం 1200 కోట్లు. అంటే ఈ 1200 పైనవి ఈ 510 కలిపితే మొత్తం 1710 కోట్లు లక్ష కోట్ల అప్పు కోసం 1710 కోట్లు బ్రోకర్లకు లంచాలు చెల్లిస్తున్నది ఈ ప్రభుత్వం. బాండ్ల ముసుగులో ఇదంతా చేస్తున్నరు. బొందల గడ్డకు కూడా జాగ లేకుండా ఖతం పట్టిస్తున్నరు. ఫైనాన్స్ గ్రాంట్ ఇవ్వడం లేదు మీరు తెచ్చుకోండి అంటే మేం అప్పు తెచ్చుకున్నం, కరోనా వల్ల అప్పు లిమిట్ పెంచితే కొంత తెచ్చుకున్నం, ఉదయ్ స్కీం ద్వారా కేంద్రం బలవంతంగా రుద్దిన అప్పు, జీఎస్టీ పరిహారంగా తెచ్చిన అప్పు ఇవన్నీ మేము చెబుతున్న 4.17లక్షల కోట్ల అప్పులో ఉన్నాయి. మేమీ 4.17లక్షల కోట్లతో... కాళేశ్వరం, మిషన్ భగీరథ, పాలమూరు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం, సీతారామ ప్రాజెక్టు, దేవాదుల ప్రాజెక్టు, సమ్మక్క సాగర్, రైతు బంధుకు 72,972కోట్లు రైతు బీమా 6,800 కోట్లు, రైతు రుణమాఫీ 29వేల కోట్లు, ఉచిత కరెంట్ కు 61వేల కోట్లు, గొర్రెల పంపిణీకి 5వేల కోట్లు, మీరు కూర్చుంటున్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయం, పటిష్టమైన భద్రత కోసం కమాండ్ కంట్రోల్ సెంటర్ జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ, జిల్లాకు ఒక నర్సింగ్ కాలేజీ, జిల్లాకు ఒక కలెక్టరేట్ కట్టినం. సొంత ఆదాయ వనరులను పెంచినం జీఎస్డీపీ 4,51,580 కోట్ల నుంచి 13,13,391 కోట్లకు పెంచినం, తెలంగాణ తలసరి ఆదాయం 1,24,104 నుంచి 3,17,117 కోట్లకు పెంచినం. ఇవన్నీ ఎందుకు మాట్లాడరు. ఇవన్నీ కళ్ల ముందే ఉన్నాయి కదా? ఇప్పుడు మీరేం చేస్తున్నరు. కరోనా లేదు, నోట్ల రద్దు లేదు, కేంద్రం మెడ మీద కత్తి పెట్టలేదు. భట్టి నిన్న సింగరేణి గురించి మాట్లాడారు.. 40లక్షల బొగ్గు మాయంపై సింగరేణి విజిలెన్స్ విచారణ చేస్తదట. దొంగకే తనకు తానుగా విచారణ చేసుకోమని చెప్పినట్లుంది. సింగరేణిలో కుంభకోణాలు జరిగితే, అదే సింగరేణి విజిలెన్స్ అధికారులతో విచారణ చేయిస్తాం అనడంలో అర్థం ఉందా? వెయ్యి కోట్ల సోలార్ పవర్ స్కాం గురించి మాట్లాడలేదు. పాకిస్తాన్ బార్డర్ జైసల్మేర్ లో సోలార్ ప్లాంట్ పెడతాం అన్నరు. ఆ స్కాం గురించి మాట్లాడరు. సింగరేణిలో ఎక్స్ ప్లోసివ్ స్కాం గురించి మాట్లాడరు. డీజిల్ స్కాం గురించి మాట్లాడరు. చేతనైతే పాలన మీద దృష్టి పెట్టండి. బాధ్యతాయుతమైన రాజకీయ నాయకుడిగా, శాసన సభ్యుడిగా, కేసీఆర్ శిష్యుడిగా, తెలంగాణ ఉద్యమకారుడిగా చెబుతున్నా బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పు 4.17లక్షల కోట్లు మాత్రమే దీనికి నేను కట్టుబడి ఉన్నా ఏ చర్చకైనా సిద్ధం. పెట్టండి అసెంబ్లీ మాట్లాడుదాం అని హరీష్‌రావు సవాల్ విసిరారు.

# బియ్యం ఎగుమతుల్లో రాష్ట్రం అగ్రస్థానం

**హైదరాబాద్, జూలై 4 సిరి న్యూస్:**

తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ బియ్యం ఉత్పత్తి, ప్రాసెసింగ్, ఎగుమతుల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి (Minister Uttam Kumar Reddy ) అన్నారు. శనివారం నల్గొండ జిల్లా మిర్యాలగూడలో రూ.150 కోట్ల వ్యయంతో నిర్మించిన అత్యాధునిక బందారు అగ్రోటెక్ రైస్ మిల్లును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, వరి ఉత్పత్తి, ధాన్యం కొనుగోళ్లలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానానికి చేరుకుందని తెలిపారు. ఇకపై కేవలం ధాన్యం కొనుగోళ్లకే పరిమితం కాకుండా, నాణ్యమైన బియ్యాన్ని దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేసే రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. బియ్యం ఎగుమతులు చేసే రైస్ మిల్లులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించే దిశగా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. దీంతో మిల్లర్లు నాణ్యత పెంపు, ఆధునిక సాంకేతికత వినియోగం, బ్రాండింగ్, ఎగుమతులపై మరింత దృష్టి సారించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం సంప్రదాయ రైస్ మిల్లుల కాలం ముగుస్తోందని, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాల్సిన సమయం వచ్చిందని మంత్రి అన్నారు. ఆటోమేటిక్ యంత్రాలు, శాస్త్రీయ ధాన్యం ఆరబెట్టే వ్యవస్థలు, సైలోలు, నాణ్యత పరీక్షా పరికరాలు వంటి ఆధునిక సదుపాయాలతో మిల్లులను అభివృద్ధి చేసుకోవాలని మిల్లర్లకు సూచించారు. "రైస్ మిల్లుల ఆధునికీకరణ ఇక ఎంపిక కాదు... కాలానుగుణ అవసరం" అని మంత్రి స్పష్టం చేశారు. తెలంగాణలో ఉత్పత్తయ్యే బియ్యాన్ని కేవలం కేంద్ర ప్రభుత్వానికి సరఫరా చేయడమే కాకుండా, 'తెలంగాణ రైస్' పేరుతో దేశవ్యాప్తంగా, విదేశాల్లో ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని అన్నారు. నాణ్యతతో కూడిన విలువ ఆధారిత ఉత్పత్తుల ద్వారా రైతులు, మిల్లర్లు, వినియోగదారులందరికీ ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. ఈ రబీ మార్కెటింగ్ సీజన్‌లో రాష్ట్రంలో ఇప్పటికే 81 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం కొనుగోలు జరిగిందని తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఇది గణనీయమైన పెరుగుదల అని, ప్రభుత్వ కొనుగోలు వ్యవస్థపై రైతులు ఉంచిన విశ్వాసానికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి ప్రాసెసింగ్ సాంకేతికత, మెరుగైన నిల్వ సదుపాయాలు, పంట అనంతర నష్టాల నివారణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. శాస్త్రీయ నిల్వ, సమర్థవంతమైన మిల్లింగ్, నాణ్యమైన బ్రాండింగ్ ద్వారా తెలంగాణ బియ్యానికి దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో మరింత ఆదరణ లభిస్తుందని చెప్పారు. మిర్యాల గూడలో అత్యాధునిక రైస్ మిల్లును ఏర్పాటు చేసిన బందారు అగ్రోటెక్ యాజమాన్యాన్ని మంత్రి అభినందించారు. ఇటువంటి పెట్టుబడులు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెంచడంతో పాటు రైతులు పండించే ధాన్యానికి మరింత విలువ తీసుకువస్తాయని అన్నారు.

# కల్తీ ఆహార మాఫియాపై ఉక్కుపాదం

- **100 రోజుల్లో 185 కేసులు నమోదు**
- **121 టన్నుల కల్తీ ఆహార పదార్థాల స్వాధీనం**

**హైదరాబాద్, జూలై 4 సిరి న్యూస్:**



హైదరాబాద్ నగరంలో ఆహార కల్తీకి పాల్పడుతున్న వారిపై పోలీసులు కఠిన చర్యలు చేపడుతున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే కల్తీ మాఫియాను అరికట్టేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హెచ్‌ఫాస్ట్ విభాగం గత 100 రోజుల్లో విస్తృత తనిఖీలు నిర్వహించి 185 కేసులు నమోదు చేసింది. ఈ దాడుల్లో మొత్తం 121 టన్నుల కల్తీ ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు.

**భారీగా కల్తీ పదార్థాల పట్టివేత**

జీహెచ్ఎంసీ ఆహార భద్రత అధికారులతో కలిసి హెచ్‌ఫాస్ట్ బృందాలు హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, ఆహార తయారీ కేంద్రాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించాయి. ఈ సందర్భంగా 27 వేల కిలోల కల్తీ అల్లంవెల్లుల్లి పేస్ట్, 25 వేల కిలోల కృత్రిమంగా పండించిన పండ్లు, 60 టన్నులకు పైగా చికెన్ వ్యర్థాలు, 9 వేల కిలోల నిల్వ పచ్చళ్లను స్వాధీనం చేసుకున్నారు. టీ పొడి, కోవా, క్రీమ్, నెయ్యి, పన్నీర్, పెరుగు తదితర ఆహార పదార్థాల్లోనూ కల్తీ జరుగుతున్నట్లు గుర్తించారు.

**పన్నీర్ తయారీలో ప్రమాదకర రసాయనాలు**

పన్నీర్ తయారీలో హానికర రసాయనాలు ఉపయోగిస్తున్నట్లు తనిఖీల్లో బయటపడిందని అధికారులు తెలిపారు. ప్రజల ఆరోగ్యానికి ముప్పు కలిగించే ఆహార ఉత్పత్తులు తయారు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పలు హోటళ్లు, రెస్టారెంట్లలో అపరిశుభ్ర పరిస్థితులు కూడా గుర్తించినట్లు వెల్లడించారు. ప్రాంతాల వారీగా రాజేంద్రనగర్ జోన్‌లోనే అత్యధికంగా 55 కేసులు నమోదయ్యాయని తెలిపారు. అక్కడ ఆహార తయారీ కేంద్రాలు అధికంగా ఉండటంతో కల్తీ కార్యకలాపాలు ఎక్కువగా వెలుగులోకి వచ్చినట్లు వివరించారు.

**నిబంధనలు ఉల్లంఘిస్తే పీడీ చట్టం**

ఇప్పటివరకు నమోదైన కేసులతో పాటు మరో 247 కేసులను జీహెచ్ఎంసీ ఆహార భద్రత విభాగానికి బదిలీ చేశారు. హోటళ్లు, బేకరీలు తప్పనిసరిగా ఆహార భద్రత ప్రమాణాల అనుమతి పత్రం కలిగి ఉండాలని, పరిశుభ్రత నిబంధనలు పాటించాలని ఆదేశించారు. కల్తీ ఆహార వ్యాపారులపై అవసరమైతే పీడీ చట్టం కింద కూడా కేసులు నమోదు చేస్తామని పోలీసులు స్పష్టం చేశారు. హెచ్‌ఫాస్ట్ విభాగాన్ని మరింత బలోపేతం చేసి స్టార్ హోటళ్ల నుంచి చిన్న రెస్టారెంట్లు, ఆహార తయారీ కేంద్రాలు, నిల్వ గోదాముల వరకు తనిఖీలు విస్తరిస్తామని అధికారులు తెలిపారు. ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారం అందించడమే లక్ష్యమని, కల్తీకి పాల్పడే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని హెచ్చరించారు.

# ప్రమాదరహిత విద్యుత్ సేవల లక్ష్యంగా టీజీఎస్పీడీసీఎల్ 'సురక్ష 2026'

**హైదరాబాద్, జూలై 4 (సిరి న్యూస్):**




ప్రమాదరహిత విద్యుత్ సేవలను అందించే లక్ష్యంతో టీజీఎస్పీడీసీఎల్ ప్రతిష్టాత్మకంగా 'సురక్ష 2026' పేరుతో సేఫ్టీ ఎక్స్‌పో మరియు వర్క్‌షాప్‌ను నిర్వహించనుంది. జూలై 11న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు హైదరాబాద్‌లోని మింట్ కాంపౌండ్‌లో గల టీజీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరగనుంది. టీజీఎస్పీడీసీఎల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. విద్యుత్ రంగంలో పనిచేసే ఉద్యోగులు, వినియోగదారులు మరియు సాధారణ ప్రజల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యతనిస్తూ, ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవడంపై ఈ ఎక్స్‌పోలో చర్చించనున్నారు.

**ఎక్స్‌పోలో ప్రదర్శించనున్న పరికరాలు**

ఈ సేఫ్టీ ఎక్స్‌పోలో వ్యక్తిగత భద్రతా పరికరాలు, ఇన్సులేటెడ్ టూల్స్, ఫాల్ ప్రొటెక్షన్ సిస్టమ్స్, ఎలక్ట్రికల్ టెస్టింగ్ పరికరాలు మరియు అగ్నిమాపక భద్రతా ఉత్పత్తులను ప్రదర్శించనున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ తయారీదారులు, డీలర్లు, సరఫరాదారులు మరియు పరిశ్రమ నిపుణులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు. క్షేత్రస్థాయిలో భద్రతా ప్రమాణాల అమలు, ప్రమాదాల నివారణలో అనుసరించాల్సిన ఉత్తమ పద్ధతులపై నిపుణులు వర్క్‌షాప్ నిర్వహించనున్నారు.

**సురక్షిత సమాజమే లక్ష్యం: సీఎండీ జితేష్ వి. పాటిల్**

ఈ సందర్భంగా సీఎండీ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ.. 'సేఫ్టీ ఫస్ట్ సురక్షిత ఉద్యోగి, సురక్షిత విద్యుత్ వ్యవస్థ, సురక్షిత సమాజం' అనే సందేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యుత్ భద్రతా రంగంలో అత్యాధునిక సాంకేతిక పరిష్కారాలను ప్రదర్శించేందుకు ఇది ఒక అద్భుతమైన వేదిక అని ఆయన పేర్కొన్నారు. విద్యుత్ రంగంలో ప్రమాదాలను పూర్తిగా నివారించేందుకు భాగస్వామ్య సంస్థలన్నీ చురుకుగా పాల్గొని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# అభివృద్ధి కార్యక్రమాల్లో వేగం పెంచాలి

**హైదరాబాద్, జూలై 4 సిరి న్యూస్:**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలలో వేగం పెంచాలని, ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా పని చేయాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. 'క్యూర్' పరిధిలో అఫర్డ్‌బుల్ ఎల్ఐజి అర్బన్ హౌసింగ్ స్కీమ్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణంపై సచివాలయంలోని తన కార్యాలయంలో అధికారులతో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా పేదల సొంతింటి కలను నెరవేర్చాలన్న సంకల్పంతో గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం విజయవంతమైందని, ఇది దేశానికే ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. ఇదే స్ఫూర్తిని 'క్యూర' పరిధిలో చేపట్టబోయే అఫర్డ్‌బుల్ ఎల్ఐజి అర్బన్ హౌసింగ్‌పై కూడా చూపించాలన్నారు. 'క్యూర్' పరిధిలో పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలో ఇండ్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ప్రభుత్వ ఆలోచనల మేరకు రెవెన్యూ, హౌసింగ్ విభాగాల అధికారులు సమష్టిగా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వీలైనంత త్వరగా పేదలకు ఇళ్లు అందించే విధంగా స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఇప్పటికే ఖరారైన స్థలాలలో పొజిషన్ తీసుకుని ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన కార్యాచరణను వేగవంతంగా రూపొందించాలని ఆదేశించారు. ఇంకా కొన్ని నియోజకవర్గాలలో స్థలాలను గుర్తించి తక్షణమే ఖరారు చేయాల్సి ఉందన్నారు. 'క్యూర' పరిధిలోని 26 నియోజకవర్గాలకు ప్రతి నియోజకవర్గంలో తొలి విడతలో 500 ఇళ్లు నిర్మిస్తున్నామని, వీటికి టెండర్లను వీలైనంత త్వరలో ఖరారు చేస్తామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పది ఆర్డీవో, 107 తహసీల్దార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్‌కు సంబంధించి రెండు డీఐజి, నాలుగు జిల్లా సబ్ రిజిస్ట్రార్, 52 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మిస్తున్నామని, ఈ భవనాలన్నీ ఒకే డిజైన్‌లో ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా నిర్మిస్తామని చెప్పారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ ఆదా, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలతో సోలార్ పార్కింగ్ సదుపాయాలు కల్పిస్తాం అని మంత్రి పొంగులేటి తెలిపారు. సమావేశంలో హౌసింగ్ కార్యదర్శి వి.పి. గౌతమ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

# నిలోఫర్‌లో పసికందును వదిలేసిన తల్లిదండ్రులు

మొదటిపేజీ తరువాయి

చేసుకుంది. ఒడిశాకు చెందిన దంపతులు తమ ఆరు రోజుల మగ శిశువును హాస్పిటల్‌లో చేర్చారు. శిశువు శ్వాసకోస సమస్యతో బాధపడుతున్నాడు. ఏప్రిల్ 25న శిశువును నీలోఫర్‌లో చేర్చిన తల్లిదండ్రులు అక్కడి నుంచి అదృశ్యమయ్యారు. పసికందుకు సంబంధించిన వారు ఎవరూ లేకపోవడంతో హాస్పిటల్ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే పసికందును నీలోఫర్ హాస్పిటల్ వైద్యులు ఎంతో జాగ్రత్తగా చూసుకున్నారు. ఎన్‌బీసీయూలో చికిత్స అందించి.. శిశువును కాపాడారు. ఆసుపత్రి ఆర్ఎంఓ ఫిర్యాదు మేరకు నాంపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పసికందును సంరక్షణ కోసం శిశు విహార్‌కు తరలిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. శిశువు తల్లిదండ్రులను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.



# మేడిగడ్డ బ్యారేజీకి పెరుగుతున్న వరద ప్రవాహం

**భూపాలపల్లి, జూలై 4**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజీకి వరద ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల ప్రభావంతో బ్యారేజీకి వరద నీరు నిరంతరాయంగా చేరుతోంది. వరద ఉధృతి దృష్ట్యా అధికారులు అప్రమత్తమయ్యారు. ముందస్తు జాగ్రత్త చర్యగా బ్యారేజీలోని మొత్తం 85 గేట్లను పూర్తిగా ఎత్తివేసి, వచ్చిన నీటిని వచ్చినట్టుగానే దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం మేడిగడ్డ బ్యారేజీ వద్ద ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో సమానంగా కొనసాగుతున్నాయి. ఎగువ నుంచి 62,700 క్యూసెక్కుల వరద నీరు చేరుతుండగా, అదే స్థాయిలో 62,700 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.

ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కొనసాగితే వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో నీటి పారుదల శాఖ సిబ్బంది బ్యారేజీ వద్ద పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నారు.

# నిరుపేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి..

- 91 మంది లబ్ధిదారులకు రూ.39.42 లక్షల చెక్కుల పంపిణీ
- పటాన్‌చెరులో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి చేతుల మీదుగా అందజేత



**పటాన్‌చెరు, జూలై 4 (సిరి న్యూస్):**

ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఆపద్బాంధవంగా నిలుస్తోందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అత్యవసర వైద్య చికిత్సలు, ప్రమాదాలు, ఇతర క్లిష్ట పరిస్థితుల్లో ఈ పథకం ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం నిరుపేద కుటుంబాలకు పెద్ద ఊరటనిస్తోందని పేర్కొన్నారు.శనివారం సాయంత్రం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాలు, డివిజన్లు, మున్సిపాలిటీలకు చెందిన 91 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.39 లక్షల 42 వేల విలువైన చెక్కులను ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియోజకవర్గంలోని ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నామని, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వైద్య చికిత్సల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు.సంక్షేమ పథకాల కోసం దళారులను ఆశ్రయించకుండా నేరుగా సంబంధిత అధికారులు లేదా ప్రజాప్రతినిధులను సంప్రదించాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, అంతిరెడ్డి, శ్రీకాంత్, నారాయణరెడ్డి, దుర్గారెడ్డి, తదితరులు పాల్గొన్నారు

# భోజనం కాదు బకాయిలు ఇవ్వండి

**పిఆర్టీయు జిల్లా అధ్యక్షులు మేడి సతీష్ రావు.**

**మెదక్,జూలై 04,(సిరి న్యూస్)**



పాఠశాలల్లో ఉపాధ్యాయులకు టిఫిన్,భోజనాల ఏర్పాటు అంశం ఉపాధ్యాయుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని టిఫిన్,భోజనం ఏర్పాటు నిర్ణయాన్ని తక్షణమే విర మించుకోవాల ని పిఆర్టీయు మెదక్ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు మేడి సతీష్ రావు,సామ్యా నాయక్ లు ప్రభుతాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇప్పటివరకు ఇవ్వాల్సిన 6 డిఏలు,పిఆర్సి ,జీపిఎఫ్ బకాయిలు ,సీపీఎస్ ఉద్యోగుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలనీ ,సిపిఎస్ ని రద్దుచేసి ఓపిఎస్ విధానాన్ని తీసుకురావాలి,317 ఉపాధ్యాయుల సమస్యను సత్వరంగా పరిష్కరించాలని, సత్వరమే హెల్త్ కార్డులను జారీ చేయాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి

**మెదక్ జిల్లా తపస్ మహిళా ప్రధాన కార్యదర్శి రేఖా సుజాత**



**వెల్దుర్తి, జూన్ 4, (సిరి న్యూస్ )**

తపస్ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు వెల్దుర్తి తపస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పోచయ్య, ఆనంద్ సింగ్ ఆధ్వర్యంలో ఎమ్మార్వో విజయలక్ష్మి కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా తపస్ మెదక్ జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి రేఖ సుజాత మాట్లాడుతూ పెండింగులో ఉన్న డి ఏ లను విడుదల చేయాలని, పిఆర్సి ప్రకటించి వెంటనే అమలు చేయాలని, సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ విధానం అమలు చేయాలని, జీ ఓ 317 బాధితులకు న్యాయం చేయాలని వారన్నారు.ఈ కార్యక్రమం లో తపస్ నాయకులు నరేందర్ రెడ్డి, అర్చన, చాకలి శ్రీనివాస్, ఆర్ శ్రీనివాస్, ఎస్. శ్రీనివాస్, సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రహరీ గోడ నిర్మాణ పనులకు శ్రీకారం

- త్వరలో భక్తులకు అందుబాటులోకి ఆలయం - ఆలయ కమిటీ
- శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం తుది దశకు

**గుమ్మడిదల, జులై 4 (సిరి న్యూస్):**



గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలో నిర్మాణంలో ఉన్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానం పనులు తుది దశకు చేరుకున్నాయి. ఆలయ నిర్మాణం దాదాపు పూర్తికావడంతో ప్రస్తుతం ఆలయం చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణ పనులను వేగవంతంగా చేపడుతున్నారు. ఆలయ పవిత్రత, భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రహరీ గోడ నిర్మాణంతో పాటు అవసరమైన ఇతర మౌలిక వసతుల ఏర్పాటును కూడా ఆలయ కమిటీ పర్యవేక్షణలో కొనసాగిస్తున్నారు. ఆలయ నిర్మాణం ప్రారంభమైన నాటి నుంచి స్థానిక భక్తులు, దాతల సహకారంతో పనులు నిరంతరం కొనసాగుతున్నాయి. సంప్రదాయ దేవాలయ శైలిలో నిర్మితమవుతున్న ఈ ఆలయం గుమ్మడిదల పట్టణానికి ఆధ్యాత్మిక కేంద్రంగా రూపుదిద్దుకుంటోంది. ఆలయ నిర్మాణం పూర్తయిన తర్వాత నిత్యపూజలు, ప్రత్యేక ఉత్సవాలు, వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

### భక్తుల ఆకాంక్ష నెరవేరనున్న వేళ

గుమ్మడిదలలో ఎంతోకాలంగా శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం నిర్మించాలని స్థానిక భక్తులు కోరుకుంటున్నారు. ప్రస్తుతం నిర్మాణ పనులు చివరి దశకు చేరుకోవడంతో భక్తుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఆలయం పూర్తయి ప్రారంభోత్సవం జరిగితే గుమ్మడిదలతో పాటు పరిసర గ్రామాల భక్తులకు పూజా కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు విశేష సౌకర్యం కలగనుంది.

### త్వరలో ప్రారంభోత్సవం

ఆలయ నిర్మాణం పనులను త్వరగా పూర్తిచేసి త్వరలో ప్రారంభోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తామని కమిటీ చైర్మన్ మద్దుల బాల్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం ప్రహరీ గోడ నిర్మాణంతో పాటు మిగిలిన పనులను కూడా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తున్నామని చెప్పారు. భక్తుల సహకారంతో ఆలయ నిర్మాణం చివరి దశకు చేరుకుందని, అన్ని పనులు పూర్తయిన అనంతరం వేదపండితుల ఆశీర్వాదాలతో ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించి భక్తులకు ఆలయాన్ని అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మండలి తులసీదాస్, ఆలయ కమిటీ కోశాధికారి పోచుగారి రవీందర్ రెడ్డి, బుచ్చగారి రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు పక్క గుంతలను సొంత నిధులతో పూడ్చివేత

- ప్రయాణికుల భద్రతకు ఉపసర్పంచ్ చొరవ
- నల్లవల్లి ఉపసర్పంచ్ పోచయ్య సేవలను అభినందిస్తున్న ప్రజలు

**గుమ్మడిదల, జులై 4 (సిరి న్యూస్):**





గుమ్మడిదల మండల పరిధిలోని నర్సాపూర్ ప్రధాన రహదారి నుంచి నల్లవల్లి గ్రామానికి వెళ్లే రహదారిపై ఇరువైపులా ఏర్పడిన భారీ గుంతలు ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. రహదారి అంచులు పూర్తిగా దెబ్బతినడంతో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు రోడ్డు పక్కకు దిగిన వెంటనే ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది. గత కొంతకాలంగా ఈ రహదారిపై అనేక ప్రమాదాలు చోటుచేసుకోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికుల ఇబ్బందులను గుర్తించిన నల్లవల్లి గ్రామ ఉపసర్పంచ్ ఎర్రోళ్ల పోచయ్య ప్రత్యేక చొరవ తీసుకుని, ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూడకుండా తన సొంత నిధులతో జేసీబీ యంత్రాన్ని ఏర్పాటు చేసి రహదారి ఇరువైపులా ఏర్పడిన గుంతలను పూడ్చివేయించారు. దీంతో రహదారిపై ప్రయాణం మరింత సురక్షితంగా మారిందని స్థానికులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ ప్రజల సమస్యలను గుర్తించి వెంటనే స్పందించే ప్రజాప్రతినిధులే నిజమైన నాయకులని కొనియాడారు. చిన్న సమస్యలను కూడా నిర్లక్ష్యం చేయకుండా ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని చర్యలు తీసుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రత్యేకంగా నల్లవల్లి నుంచి మర్రిగూడెం వెళ్లే రహదారిపై కూడా రోడ్డు పక్కన ఉన్న ప్రమాదకర గుంతలను పూడ్చివేయడంతో ప్రమాదాల ముప్పు గణనీయంగా తగ్గిందని ప్రయాణికులు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు మరింత కొనసాగాలని, రహదారుల నిర్వహణపై సంబంధిత శాఖలు కూడా ప్రత్యేక దృష్టి సారించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# మౌలిక సదుపాయాల కల్పనే గ్రామాభివృద్ధి లక్ష్యం

- సర్పంచ్ కొమ్ము శ్రీనివాస్
- అనంతారం ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం

**గుమ్మడిదల, జులై 4 (సిరి న్యూస్):**

గుమ్మడిదల మండల పరిధిలోని అనంతారం గ్రామంలోని ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు గ్రామ సర్పంచ్ కొమ్ము శ్రీనివాస్ శంకుస్థాపన చేసి పనులను శనివారం ప్రారంభించారు. కాలనీవాసులు చాలా కాలంగా ఎదురుచూస్తున్న ఈ రహదారి నిర్మాణంతో స్థానికుల రాకపోకలకు ఎంతో సౌలభ్యం కలగనుంది. ఈ సందర్భంగా సర్పంచ్ కొమ్ము శ్రీనివాస్ మాట్లాడుతూ, గ్రామంలో ప్రతి కాలనీకి మౌలిక వసతులు కల్పించడమే గ్రామపంచాయతీ లక్ష్యమని అన్నారు. ప్రజలకు మెరుగైన రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ వంటి సౌకర్యాలను దశలవారీగా అందిస్తున్నామని తెలిపారు. ఎస్సీ కాలనీ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. సీసీ రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించిన సర్పంచ్, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ప్రజాధనం వృథా కాకుండా నాణ్యమైన పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయిన తర్వాత వర్షాకాలంలో బురద సమస్య పూర్తిగా తొలగిపోవడంతో పాటు



రాకపోకలు సులభతరం అవుతాయని కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్న గ్రామపంచాయతీకి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాన రహదారిపై డ్రైనేజీ నీరు నిల్వ

**పట్టించుకోని అధికారులు**

**వెల్దుర్తి, జులై 04,(సిరి న్యూస్):**





వెల్దుర్తి పట్టణంలోని ప్రధాన రహదారి అయిన చెంది మెదక్ రోడ్డు పక్కనే డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ మధ్యకాలంలోనే వర్షాలు కురుస్తున్నందుకు మురికి కాలువలు నిండుగా ప్రవహిస్తున్నాయని మురికి కాలువల మధ్యలో కొంతమంది అక్రమంగా మట్టి పోయడం ద్వారా సాఫీగా వెళ్ళటం లేదని దానివల్ల వ్యాపారస్తులకు దుర్గంధం అలాగే దోమల బెడదా కూడా ఎక్కువ ఉందని వ్యాపారస్తులు కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలానే ఉంటే దోమల వల్ల డెంగ్యూ,మలేరియా, టైఫాయిడ్, వంటి విషజరాలు కూడా వస్తాయని వ్యాపారస్తులు ఆరోపిస్తున్నారు. వర్షాకాలంలో ప్రధాన రహదారిపై నీరు నిలిచిపోవడంతో ప్రజలు, వ్యాపారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు డ్రైనేజీ మార్గాలను సరిచేసి, వర్షపు నీరు వేగంగా డ్రైనేజీలోకి వెళ్లేలా చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పంచాయతీ కృషి చేయాలని వ్యాపారస్తులు కోరుకుంటున్నారు.

# మైనంపల్లి హనుమంతరావును మర్యాదపూర్వకంగా కలిసిన

- బొంగునూరి కిషోర్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ప్రోటోకాల్ వైస్ చైర్మన్

**సిరి న్యూస్ , జూలై 4: కుత్బుల్లాపూర్ ప్రతినిధి**



మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మైనంపల్లి హనుమంతరావును రాష్ట్ర ప్రోటోకాల్ కోఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి ఆయన నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మల్కాజ్‌గిరి మాజీ శాసనసభ్యుడు, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మైనంపల్లి హనుమంతరావును రాష్ట్ర ప్రోటోకాల్ కోఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలు తదితర అంశాలపై పరస్పరం చర్చించినట్లు తెలిసింది. అనంతరం మైనంపల్లి హనుమంతరావుకు బొంగునూరి కిషోర్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేయగా, హనుమంతరావు అభినందనలు తెలియజేశారు. ఈ భేటీ ఆత్మీయ వాతావరణంలో జరిగింది.

# ప్రజల కష్టాలకు పారా పట్టిన మాజీ కార్పొరేటర్.!..

- బురద తీసి..చెత్త వదిలేశారు.ప్రజలకు రెట్టింపు కష్టాలు..
- ప్రజల కష్టాలకు పారా పట్టి బురదలోకి దిగిన మాజీ కార్పొరేటర్..
- మున్సిపల్, జలమండలిపై మాజీ కార్పొరేటర్ నర్సింహ యాదవ్ ఆగ్రహం..
- గుప్ప మెస్తరి పాలనపై స్థానికుల ప్రశ్నల వర్షం..
- చెత్త తొలగించకపోతే ఉద్యమం: హెచ్చరిక..



బురద చెత్త తొలగిస్తున్న ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్..



**మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ప్రతినిధి, జులై 4 ( సిరి న్యూస్ ):**

కూకట్‌పల్లి నియోజకవర్గం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ పరిధిలోని టీచర్స్ కాలనీ, వల్లభ్ నగర్ ప్రాంతాల్లో గత కొన్ని రోజులుగా డ్రైనేజీలో బురద పేరుకుపోయి రోడ్లపైకి పొంగి పొర్లుతోంది. చివరకు డ్రైనేజీ నుంచి బురద తొలగించినా, ఆ బురదను చెత్త కుప్పలుగా అక్కడే వదిలేయడంతో స్థానికుల కష్టాలు మరింత పెరిగాయి. ఈ చెత్త కుప్పల మధ్య నుంచి రాకపోకలు సాగించే సమయంలో అది కాళ్లకు, బట్టలకు తగిలి, తిరిగి ఇళ్లలోకి బురద చేరుతోందని స్థానికులు వాపోతున్నారు. వర్షం పడిన ప్రతిసారి ఇళ్ల ముందు మురుగునీరు నిలిచిపోయి ఈ ప్రాంత వాసులు నరక యాతన అనుభవిస్తున్నారు. చుట్టుపక్కల గుప్పుమనే దుర్వాసన, దోమల బెడద, రోగాల భయంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంతటి తీవ్ర సమస్య ఉత్పన్నమైనా మున్సిపల్ అధికారులు, జలమండలి అధికారులు ఇద్దరూ కళ్లు మూసుకుని కూర్చున్నారు, తప్ప స్పందించిన పాపాన పోలేదు.ఈ నిర్లక్ష్యంపై ఓల్డ్ బోయిన్‌పల్లి మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల కోసం ఎదురుచూడకుండా ఆయన స్వయంగా సంఘటన స్థలానికి చేరుకుని, ముక్కుపుటా లదిరే దుర్వాసన గుప్పుమనే ఆ వాతావర ణంలోనే చేతికి పారా పట్టుకుని ఒక సాధారణ కూలీలా బురద తొలగింపు పనుల్లో మమేకమయ్యారు. మాజీ కార్పొరేటర్ స్థాయిలో ఉన్న వ్యక్తి ఇలాంటి దుర్గంధభరిత వాతావరణంలో కూలీలా బురద తొలగించాల్సిన దుస్థితి రావడంపై ఇది కేవలం అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా అని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే డ్రైనేజీ నుంచి తొలగించిన బురదను సంబంధిత శాఖ అధికారులు సిబ్బంది సక్రమంగా తరలిం చకుండా అక్కడే చెత్త కుప్పలుగా వదిలేయడం మరో వివాదానికి దారి తీసింది.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన నర్సింహ యాదవ్, తాను చేస్తున్నది రాజకీయం కాదని, ప్రజలకు జవాబుదారీ నాయకుడిగా ఉండటమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. తాను పదవిలో ఉన్నా లేకున్నా ప్రజల సమస్యలను పరిష్క రించడమే తన ధ్యేయమని, అందుకోసమే ఈ దుర్వాసనను కూడా లెక్కచేయకుండా స్వయంగా రంగంలోకి దిగానని అన్నారు. ఏకంగా 15 సంవత్సరాలు కార్పొరేటర్‌గా సేవలందించిన ఆయన, తన సుదీర్ఘ పదవీ కాలంలో ఇలాంటి దుస్థితి ఏనాడూ చూడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఏనాడూ ఇలాంటి సమస్యలు తలెత్తలేదని, తాను ఫోన్ చేసిన వెంటనే మున్సిపల్ అధికారులు, జలమండలి అధికారులు స్పందించి తక్షణమే పరిష్కారం చూపేవారని గుర్తు చేసుకున్నారు. కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో పరిస్థితి పూర్తిగా భిన్నంగా మారిందని, బురద తీయడమే గగనమైపోతే దాన్ని తరలించడం గురించి ఎవరూ పట్టిం చుకోవడం లేదని మండిపడ్డారు. డ్రైనేజీ నుంచి తీసిన బురదను వెంటనే తరలించ కపోతే వర్షం పడినప్పుడు అది తిరిగి డ్రైనేజీలోకే చేరి సమస్య మళ్లీ మొదటికొ స్తుందని ఆయన హెచ్చరించారు. మున్సిపల్ అధికారులు, జలమండలి అధికారులు ఇద్దరూ సమన్వయంతో పనిచేయకపోవడం వల్లే ఈ సమస్య ఇంతగా జఠిలమైందని తీవ్రంగా విమర్శించారు. ప్రజాధనంతో జీతాలు తీసుకుంటున్న అధికారులు ఈ దుర్గంధాన్ని చూసైనా కనీస బాధ్యత చూపక పోవడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడైనా సంబంధిత అధికారులు స్పందించిన వెంటనే ఈ చెత్త కుప్పలను తరలించి, డ్రైనేజీ సమస్యకు మున్సిపల్, జలమండలి శాఖలు సంయుక్తంగా శాశ్వత పరిష్కారం చూపాలని, లేకుంటే మరింత తీవ్రస్థాయిలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ఇర్ఫాన్, సెక్రటరీ హరినాథ్, డాక్టర్ సుధాకర్, పోచయ్య, రాజుగౌడ్, బుర్రి యాదగిరి, రమేష్, కాలనీవాసులు తుమ్మ చంద్రశేఖర్, అర్చన, మహేశ్వరి, అనిత, సందీప్, జాఫర్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు. దుర్వాసనను కూడా లెక్కచే యకుండా, రాజకీయాలకు అతీతంగా ప్రజా సమస్యల పరిష్కారానికి స్వయంగా బురదలో దిగి పనిచేసిన నర్సింహ యాదవ్ చొరవను స్థానికులు మనసారా అభినంది స్తున్నారు, అదే సమయంలో బురద తీసినా చెత్తను తరలించని మున్సిపల్, జలమండలి అధికారుల నిర్లక్ష్య వైఖరిపై, కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు..

# ప్రజాస్వామ్య స్ఫూర్తిని పెంపొందించేలా విద్యార్థి నాయకుల ఎన్నికలు

- కానుకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెడ్ బాయ్, హెడ్ గర్ల్ ఎన్నిక
- విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుత భావన పెంపొందించడమే లక్ష్యం

**గుమ్మడిదల, జులై 4 (సిరి న్యూస్):**

గుమ్మడిదల మండల పరిధిలోని కానుకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుత భావన పెంపొందించే లక్ష్యంతో హెడ్ బాయ్, హెడ్ గర్ల్‌తో పాటు వివిధ కమిటీల ప్రతినిధుల ఎన్నికలను ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా ఓటు హక్కును వినియోగించి తమ ప్రతినిధులను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో హెడ్ బాయ్‌గా ప్రదీప్ చారి, హెడ్ గర్ల్‌గా నిహారిక ఎన్నికయ్యారు. అలాగే ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠశాల వివిధ కమిటీలకు విద్యార్థి ప్రతిని ధులను కూడా ఎన్నుకున్నారు. ఎన్నికల ఫలితాలు ప్రకటించిన అనంతరం విజేతలను ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నీరజ మాట్లాడుతూ పాఠశాలల్లో నిర్వహించే ఇలాంటి ఎన్నికలు విద్యార్థులకు ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన కల్పించడంతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. చిన్నప్పటి నుంచే బాధ్యతాయుతమైన నిర్ణయాలు తీసుకోవడం, సహ విద్యార్థులతో సమన్వయంగా పనిచేయడం, సేవాభావంతో ముందుకు సాగడం వంటి విలువలు అలవడతాయని పేర్కొన్నారు. ఎన్నికల్లో గెలుపు, ఓటమిని సమానంగా స్వీకరించి పరస్పర సహకారంతో పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. ఎన్నికైన ప్రతినిధులు తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తూ క్రమశిక్షణ, సేవాభావం, నాయకత్వంతో తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. ఎన్నికల నిర్వహణ బాధ్యతలను సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు రమేష్ చేపట్టి, విద్యార్థులకు ఎన్నికల ప్రక్రియ, ఓటు హక్కు ప్రాముఖ్యత, రహస్య ఓటింగ్ విధానం, ప్రజాస్వామ్య విలువలపై అవగాహన కల్పించారు. ఎన్నికలు పారద ర్శకంగా, క్రమబద్ధంగా నిర్వహించడంతో విద్యార్థులు ఆసక్తిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు



పెంచలయ్య, ప్రభాకర్ రెడ్డి, శివకుమార్, సుజాత, సువర్చల, చిత్రప్రియ, రజనీకుమారి, విజేత కుమారి, ఈశ్వరి, భబిత, రత్న, సాయిలీల తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగిసిన అనంతరం ఎన్నికైన విద్యార్థి ప్రతిని ధులను అభినందిస్తూ విద్యార్థులందరికీ చాక్లెట్లు పంపిణీ చేశారు.

# ప్రజా సమస్యలను పరిశీలించిన కూన శ్రీనివాస్ గౌడ్





- గాజులరామారంలో నెలకొన్న తాగునీటి, డ్రైనేజీ సమస్య

**సిరి న్యూస్ మేడ్చల్ మల్కాజ్గిరి ప్రతినిధి జూలై 4**

ఈ సందర్భంగా స్థానిక వాటర్ వర్క్స్ డీజీఎం రవీందర్‌తో పాటు సిఎంసి వర్క్ ఇన్స్పెక్టర్ రాజేందర్ రెడ్డి సంబంధిత అధికారులతో కలిసి కాలనీలో పర్యటించి సమస్యలను పరిశీలించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఆయన, తాగునీటి సమస్యతో పాటు డ్రైనేజీ, నూతన సీసీ రోడ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు, నాలా పునరు ద్ధరణ సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరి స్తానని తెలియజేశారుస్థానిక ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడం మా బాధ్యత కూన శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు..ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు బుచ్చిరెడ్డి తో పాటు స్థానిక కాలనీ సభ్యులు గోపాల్ రెడ్డి, సూరపు రాజు, శ్రీకాంత్ రెడ్డి, వల్లెపు వేణు, అంజన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు...

# ప్రగతి నగర్ సాయినగర్‌లో డ్వాక్రా మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ

- ముఖ్య అతిథిగా కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి సిరి న్యూస్ జులై 4**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని ప్రగతి నగర్‌లోని సాయినగర్‌లో డ్వాక్రా మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. బొమ్మ వెంకటేశ్వర రెడ్డి (తాతి రెడ్డి) సమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ నియోజ కవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మహిళలకు ఇందిరమ్మ చీరలను అందజేశారు.ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, మహిళల సంక్షేమం సాధికారతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మహిళల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలు ప్రతి కుటుంబానికి చేరేలా ప్రభుత్వం కృషి.చేస్తోందన్నారు. ఇందిరమ్మ చీరల పంపిణీ వంటి కార్యక్రమాలు మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే పట్ల ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతను ప్రతిబింబిస్తున్నాయని పేర్కొన్నారు.అవస రమైన సమయంలో ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తూ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని, మహిళల అభ్యున్నతే సమాజాభివృద్ధికి పునాది వేస్తున్నట్లు . మాట్లాడారుఈ కార్యక్రమంలో కొలన్ రాజశేఖర్ రెడ్డి,



మైసిగారి శ్రీనివాస్, సిద్ధనోళ్ల సంజీవ్ రెడ్డి, రమేష్, మల్లికార్జున్, ప్రవీణ్ (లడ్డు), శ్రీను, శేఖర్, సంతోష్, రహీమ్, బషీర్, డ్వాక్రా మహిళ అధ్యక్షురాలు లక్ష్మి, చంద్రకళ, నిర్మల, ధనలక్ష్మి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల పెండింగ్ డిఏ లను విడుదల చేయాలి!!



**శివంపేట జూలై 4 (సిరి న్యూస్ )**

తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర శాఖ పిలుపుమేరకు తపస్ శివంపేట మండల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు కొండల్ రెడ్డి,మల్లేశం ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కొరకు శివంపేట తాసిల్దార్ కమలాద్రికి వినతి పత్రం సమర్పించడం జరిగింది.ఈ సందర్భంగా తపస్ రాష్ట్ర భాద్యులు రామారావు,మాట్లాడుతూ ఎలక్షన్ కంటే ముందు కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టినటువంటి హామీలను వెంటనే అమలు చేయాలని,పెండింగ్ లో ఉన్న డి ఏ లను విడుదల చేయాలని,పిఆర్సి రిపోర్టు తెప్పించుకొని వెంటనే అమలు చేయాలని,సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ అమలు చేయాలి అని,సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమ్మె కాలపు ఒక నెల వేతనాన్ని వెంటనే విడుదల చేయాలని,జిపిఎఫ్ పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని,మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 0 1 0 పద్దు కింద వేతనాలు విడుదల చేయాలి అని,జీఓ 317 నష్టపోయిన బాధితులకు న్యాయం చేయాలని,గురుకుల,కేజీబీవీ ఉపాధ్యాయ సమస్యలు పరిష్క రించాలని,ప్రతి సంవత్సరం పదోన్నతులు చేపట్టాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శేఖర్,మండల భాద్యులు రాజు,శ్రీనివాస్,నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

# షాపుల ముందరి అక్రమ షెడ్లు నేలమట్టం!

- రోడ్లపై అక్రమణాల క్లీన్ ఆఫ్
- వ్యాపారాల పేరిట రోడ్డు అక్రమిస్తే ఉపేక్షించేది లేదు జిహెచ్ఎంసి యాక్షన్!




**అమీన్ పూర్ జూలై 4 సిరి న్యూస్**




అమీన్ పూర్ జిహెచ్ఎంసి సర్కిల్ బీరంగూడ నుంచి కిష్టారెడ్డిపేట వెళ్లే ప్రధాన రహదారి ఇరువైపులా అక్రమంగా రోడ్డు కబ్జా చేసి ఫుట్పాతులు , రోడ్లపై అక్రమ కట్టడాలు నిర్మించి వాహనదా రులకు చుక్కలు చూపిస్తున్న వ్యాపారస్తులు, బీరంగూడ నుండి చుట్టుపక్కల ప్రాంతాలకు వెళ్లేందుకు అత్యంత కీలకమైనది, కావడం ఇక్కడ రోడ్డు ఇరుకుగా వారి నిత్యం ట్రాఫిక్ జామ్ లు అవుతుండడంతో జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో అధికారులు శనివారం కూల్చివేతలు చేపట్టారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ విభాగం ఈ కూల్చేతలను చేపట్టింది, అని తెలిపారు.రహదారి మార్జిన్ ను దాటి ముందుకు వచ్చిన నిర్మాణాలను జెసిబిల సహాయంతో పూర్తిగా తొలగించామని తెలిపారు. ప్రధాన రహదారులను అక్రమిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, నిబంధనలు మీరితే చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. ఈ కూల్చివేత కార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారులు, టౌన్ ప్లానింగ్ మరియు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి

## మర్యాదపూర్వకంగా కలిసిన బండారి లేఔట్ డివిజన్ అధ్యక్షులు వాసు వారగాని



**కుత్బుల్లాపూర్ సిరి న్యూస్ జులై 4**

హన్మంత రెడ్డి శాలువతో ఘనంగా సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ బలోపేతమే ప్రతి డివిజన్ అధ్యక్షుడి ప్రధాన లక్ష్యంగా ఉండాలని అన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలతో నిరంతరం మమేకమై ప్రజల సమస్యలను తెలుసుకొని, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రజాహిత కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని సూచించారు.పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే ప్రతి కార్యకర్తకు సముచిత గుర్తింపు, ప్రాధాన్యం లభిస్తుందని పేర్కొంటూ, కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి అందరూ సమిష్టిగా, సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రజల విశ్వాసాన్ని చూరగొని, రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త తన వంతు కృషి చేయాలని ఆకాంక్షించారు.

## కళాశాల హాస్టల్‌లో ఆహార భద్రతా లోపాలు గుర్తింపు..

- జిల్లా ఆహార భద్రతాధికారి రాజేశ్వర్..



**హత్నూర, జూలై 4,(సిరి న్యూస్)**

సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని డా. బి.ఆర్. అంబేద్కర్ శతజయంతి జూనియర్ కళాశాల హాస్టల్‌ను జిల్లా ఆహార భద్రత అధికారి రాజేశ్వర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ వంటగది, స్టోర్‌రూమ్‌ను పరిశీలించగా పలు ఆహార భద్రతా నిబంధనల ఉల్లంఘనలు వెలుగులోకి వచ్చాయి.తనిఖీలో స్టోర్‌రూమ్‌లో నిల్వ ఉంచిన బియ్యం, కిరాణా సరుకులు, పిండి పదార్థాల్లో నల్ల బీటిల్స్ (కీటకాలు) , తెల్లని పురుగులు ఉన్నట్లు గుర్తించారు. అంతేకాకుండా, సిబ్బంది పిండిని జల్లెడ పట్టి కీటకాలు, పురుగులను తొలగిస్తున్నట్లు ఆహార భద్రత అధికారి గుర్తించారు. ఇది నిల్వ విధానంలో నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు.వంటగదిలో నీరు నిల్వ ఉండటంతో నేల జారుడుగా మారి అపరిశుభ్ర వాతావరణం నెలకొన్నట్లు గుర్తించారు. ఇటువంటి పరిస్థితులు ఆహార తయారీ పరిశుభ్రతపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని సూచించారు.అదేవిధంగా, హాస్టల్ భోజనశాల పైకప్పు పలు చోట్ల దెబ్బతిని పెచ్చులు ఊడిపోయే స్థితిలో ఉండటాన్ని పరిశీలించిన ఆహార భద్రత అధికారి, అవి ఎప్పుడైనా విద్యార్థులపై పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.హాస్టల్‌లో గుర్తించిన లోపాలను వెంటనే సరిదిద్దాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. విద్యార్థుల ఆరోగ్యం, భద్రతకు ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా పరిశుభ్రత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని ఆహార భద్రత అధికారి సూచించారు.

## సత్యసాయి సంజీవనిలో చికిత్స పొందే చిన్నారులు మృత్యుంజయులు

- ఎమ్మెల్యే హరీష్ రావు
- 'గిఫ్ట్ ఆఫ్ లైఫ్' కార్యక్రమంలో సినీ హీరో విజయ్ దేవరకొండతో కలిసి పాల్గొన్న మాజీ మంత్రి హరీష్ రావు

**కొండపాక, జూలై 04, (సిరి న్యూస్ ):**
సిద్దిపేట జిల్లా కొండపాకలోని శ్రీ సత్యసాయి సంజీవని ఆసుపత్రిలో నిర్వహించిన 'గిఫ్ట్ ఆఫ్ లైఫ్' కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు సినీ నటుడు విజయ్ దేవరకొండతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ సత్యసాయి సంజీవని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు నిజమైన మృత్యుంజయులని అన్నారు. ఈ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది అంకితభావంతో, ప్రేమతో, సహనంతో చిన్నారులకు అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తున్నారని కొనియాడారు. ప్రతి సంవత్సరం వేలాది మంది చిన్నారులకు పూర్తిగా ఉచితంగా గుండె శస్త్రచికిత్సలు నిర్వహిస్తూ వారికి కొత్త జీవితాన్ని అందించడం సాధారణ విషయం కాదన్నారు. ఈ సేవా కార్యక్రమాన్ని విజయవంతంగా నడిపిస్తున్న శ్రీనివాస్ ని కనిపించే దేవుడిగా అభివర్ణించారు. ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశంలోని పలు రాష్ట్రాల నుంచి చిన్నారులు ఇక్కడికి వచ్చి వైద్యం పొందడం ఈ సంస్థపై ఉన్న విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులకు ఏమాత్రం తీసిపోని విధంగా పరిశుభ్రత, వైద్య సేవలు, ప్రేమాభిమానాలతో కూడిన చికిత్స ఇక్కడ అందిస్తున్నారని అన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ తమకు తోచిన విధంగా సేవా కార్యక్రమాలకు సహకరించాలని, ఈ ఆసుపత్రి చేస్తున్న సేవలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. జీవితంలో సంపాదించిన ఆస్తి, పదవుల కంటే మనం చేసిన సేవే శాశ్వతంగా నిలిచిపోతుందని అన్నారు. సత్యసాయి సంజీవని ఆసుపత్రి కేవలం ఒక ఆసుపత్రి మాత్రమే కాదని, వేలాది కుటుంబాలకు ఇది ఒక దేవాలయమని హరీష్ రావు పేర్కొన్నారు. గుండె సమస్యలతో బాధపడుతున్న చిన్నారులకు వైద్యం అందించడం ద్వారా ఈ ఆసుపత్రి కేవలం ఒక చిన్నారి గుండెనే కాదు, ఆ తల్లి, తండ్రి గుండెల్లోనూ ఆశను నింపుతోందని భావోద్వేగంగా వ్యాఖ్యానించారు. ఇటీవల 500వ గుండె శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేయడం వైద్య బృందం అంకితభావానికి నిదర్శనమని అభినందించారు. సినీ నటుడు విజయ్ దేవరకొండ విజయవంతమైన నటుడే కాకుండా మంచి మనసున్న వ్యక్తి అని కొనియాడారు. కరోనా సమయంలో వేలాది మందికి అండగా నిలవడంతో పాటు పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తూ సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం అవుతున్నారని చెప్పారు. సత్యసాయి విద్యాసంస్థల్లో చదువుకున్న విజయ్ దేవరకొండ ఈ సేవా కార్యక్రమాలకు అండగా నిలవడం అభినందనీయమని పేర్కొన్నారు. సత్యసాయి సంజీవని ఆసుపత్రి చేస్తున్న మహోన్నత సేవలకు సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని హరీష్ రావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వ్యవస్థాపకులు, వైద్యులు, నర్సులు, సిబ్బంది, సేవా కార్యక్రమాల్లో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ హరీష్ రావు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

## వివేకానందుని జీవితం విద్యార్థులకు స్ఫూర్తిదాయకం కావాలి

- స్వామి వివేకానంద యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు జల్దా లక్ష్మీనాథ్..

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జులై 4, (సిరి న్యూస్ ) :**
స్వామి వివేకానందుని జీవితం విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని స్వామి వివేకానంద యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు జల్దా లక్ష్మీనాథ్ పిలుపునిచ్చారు. శనివారం స్వామి వివేకానందుని వర్ధంతి సందర్భంగా రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని నందానగర్ అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల, గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు పండ్లు, బిస్కెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జల్దా లక్ష్మీనాథ్ మాట్లాడుతూ, స్వామి వివేకానందుడు యువతకు చూపిన మార్గం నేటి తరానికి ఎంతో ఆదర్శప్రాయమని అన్నారు. ఆయన బోధనలు, విలువలు భావితరాలకు చేరవేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, సేవాభావం, ఆత్మవిశ్వాసంతో విద్యను అభ్యసించి సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు లలిత, జ్ఞానేశ్వరి, నాగలక్ష్మి, బాబూమియా, అలాగే సంఘ సభ్యులు తిమ్మయ్య, విజయ్, రామ్‌చందర్, ఆనంద్, రమేష్, ప్రదీప్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బోరుపై రాజకీయ పెత్తనం !

## వ్యక్తిగత అవసరాలకు వాడుతున్న కాంగ్రెస్ నేత ?

- దాహంతో అల్లాడుతున్న ప్రజలు
- నోటీసులు ఇచ్చినా జాంతానై..
- తాగునీటి కోసం రైతు వేదికకు ఎస్టీ కాలనీవాసుల పరుగులు



**మంచిర్యాల, జూలై 04 (సిరి న్యూస్)**

మంచిర్యాల జిల్లా నెన్నెల్ మండలం చిత్తాపూర్ గ్రామంలో నీటి సమస్య పెద్ద చర్చనీయాంశంగా మారింది. గ్రామంలోని 10వ వార్డు ఎస్టీ కాలనీలో దాదాపు 30 సంవత్సరాల క్రితం ప్రజల మంచినీటి అవసరాల కోసం ప్రభుత్వం ఒక బోరు వేయించింది. అయితే ఇప్పుడు అదే బోరును కాంగ్రెస్ నేత జంపం శ్రీనివాస్ సొంతానికి మార్చుకున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఆయన ఈ ప్రభుత్వ బోరులో సొంతంగా మోటార్ దింపి, తన వ్యక్తిగత అవసరాలకు నీటిని వాడుకుంటున్నారని, అదే విధంగా వేరే గ్రామానికి చెందిన తోట కీ అనే వ్యక్తి కూడా ఈ బోరు నీటిని తన అవసరాలకు వినియోగించుకుంటున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ సమస్యపై చిత్తాపూర్ గ్రామ ఉప సర్పంచ్, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి వ్యక్తిగత సహాయకుడు (పీఏ) ఇక్బాల్ కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. ఆయన స్పందిస్తూ విచారణ చేపడతానని హామీ ఇచ్చినప్పటికీ, ఇప్పటివరకు కాలనీవాసులకు ఎలాంటి న్యాయం జరగలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు చిత్తాపూర్ గ్రామ పంచాయతీ సెక్రటరీ సైతం జంపం శ్రీనివాస్‌కు నోటీసు జారీ చేశారు. నోటీసు ఇచ్చి పది రోజులు గడిచినా, ఇంతవరకు ఆ మోటార్‌ను తీయకపోవడం గమనార్హం. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఇదే కాలంలో చిత్తాపూర్ గ్రామ పంచాయతీ నుండి పంచాయతీ సెక్రటరీ, గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్‌లు కొత్త మోటార్‌తో పాటు నూతన వస్తువులు తీసుకువచ్చారు. అయినప్పటికీ ఏళ్ల తరబడి ప్రభుత్వం వేసిన ఈ బోరు నుండి సొంత మోటార్‌ను తీసివేయమని చెప్తే, ఆ నాయకుడు కాలనీవాసులతో గొడవలకు దిగుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మేము కాంగ్రెస్ వాళ్ళం, మమ్మల్ని మీరు ఏం చేయలేరు అని ఆ నాయకుడు బహిరంగంగా బెదిరిస్తున్నారని కాలనీవాసులు వాపోతున్నారు.ఫలితంగా 10వ వార్డు కాలనీవాసులు తాగునీటి కోసం నానా అవస్థలు పడుతున్నారు. దగ్గరలో ఉన్న రైతు వేదిక వరకు నడుచుకుంటూ వెళ్లి అక్కడి నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. గ్రామ పంచాయతీ సెక్రటరీ, సర్పంచ్ ఎంతగా చెప్పినా ఏ మాత్రం వినకుండా, తన మొండి వైఖరిని కొనసాగిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఈ సమస్యపై ఎమ్మెల్యే పీఏ నుండి మొదలుకొని గ్రామ పంచాయతీ అధికారుల వరకు అందరికీ ఫిర్యాదులు అందినప్పటికీ, ఇంతవరకు శాశ్వత పరిష్కారం లభించలేదు. ఒక్కవైపు ప్రజలు నీటి కోసం అల్లాడుతుండగా, మరోవైపు అధికార పార్టీ నేత అండదండలతో ప్రభుత్వ ఆస్తులను సొంత అవసరాలకు వాడుకుంటున్నారన్న ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ వ్యవహారంపై అధికారులు, ఎమ్మెల్యే ఎప్పుడు స్పందిస్తారో, ఎస్టీ కాలనీ వాసుల నీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపుతారో లేదో వేచి చూడాల్సిందే.





## బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో నూతన బోర్‌వెల్ మోటర్ ఏర్పాటు చేసిన





- కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి

**సిరి న్యూస్ కుత్బుల్లాపూర్ ప్రతినిధి జూలై 4**

బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారానికి నూతన బోర్‌వెల్ మోటర్ ఏర్పాటు చేశారు కాలనీవాసులు తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై వెంటనే స్పందించిన కోలన్ హన్మంత్ రెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడి, కాలనీలో ఉన్న ఐదు బోర్‌వెల్ ప్రెస్సింగ్ అవసరమైన మరమ్మతులు చేపట్టడంతో పాటు కొత్త మోటర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆయన సూచనల మేరకు అధికారులు వెంటనే స్పందించి, నూతన బోర్‌వెల్ మోటర్‌ను కాలనీకి అందించి ఏర్పాటు కార్యక్రమాన్ని నూతనంగా ఎన్నికైన 295 డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు విజయ్ గౌడ్, 19వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి, సీనియర్ నాయకులు నర్సా రెడ్డి, బాల్‌రెడ్డి కలిసి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ కన్వీనర్ సాల్మన్ రాజ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు సురేష్, పోచి మహేష్ ఫిషర్మెన్ ప్రెసిడెంట్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు దయానంద్, మహిళా నాయకులు హేమలత, కమలమ్మ, రజియా, అలాగే సోమరాజు, వెంకటేష్, రాజు, బాలరాజు, శ్రీనివాసు, నరసింహ పాల్గొన్నారు.



# మా భోజనాలు మేము తెచ్చుకుంటాం

- మాకు ఇవ్వాల్సిన డిఏలు మాత్రం ఇవ్వండి
- ఎస్ జి టి యు అధ్యక్షులు మైపాల్ రెడ్డి



**వెల్దుర్తి, జూన్ 4 (సిరి న్యూస్ )**

ఇవ్వాల్సిన డీఏలు ఇవ్వకుండా...పీఆర్సీ అమలు చేయకుండా...సమయానికి సప్లిమెంటరీ బిల్లులు క్రెడిట్ చేయకుండా... మధ్యాహ్న భోజనం తినండి, టిఫిన్ లు చెయ్యండి అని చెప్పటం ఉపాధ్యాయ లోకాన్ని అవమానించడమేనని ఎస్ జి టి యు అధ్యక్షులు కరివేల మైపాల్ రెడ్డి అన్నారు. మా భోజనాలు మేము తెచ్చుకోవటం లేదా పిల్లలతో పాటు మేము తింటున్నాము, మాకు రావాల్సిన DA ల మీద చర్చలేదు మీరు ఇవ్వాల్సిన పి ఆర్ సి మీద చర్చ లేదు మీరు అధికారంలోకి వచ్చిన వెంటనే సీ పీ ఎస్ ★ రద్దు చేసి ★ఒ పీ ఎస్ అమలు చేస్తామని చెప్పి ఇప్పటికి ఈ విషయం పై చర్చించిన సందర్భం లేదు, మేము నేలనేలా మా జీతం నుండి జీపీఫ్ రూపంలో దాచుకున్న డబ్బులు మాకు తిరిగి చెల్లించండని కొన్ని సవత్సరాలుగా అడుగుతున్న మా డబ్బులు మాకు ఇవ్వటం లేదు కాని బుక్కెడు బువ్వపెట్టి అన్ని ఇచ్చినం అని చెప్పుకునే పరిస్థితికి తెలంగాణ రాష్ట్రం ఎదిగిందంటే నవ్వాలా ఏడవాలో తెలువటం లేదు అని వారు మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉపాధ్యాయుల సంక్షేమం దృష్టిలో పెట్టుకొని తక్షణమే ఆర్ డి ఏ,లను విడుదల చేసి పి ఆర్ సి,ని వీలైనంత త్వరగా ప్రకటించాలని సెకండరీ ఉపాధ్యాయ సంఘం కోరుతోంది ఈ నిర్లక్ష్యంతో ఒక్కో ఉపాధ్యాయుడికి లక్షల రూపాయల ఆర్థిక నష్టం కలుగుతోంది.అంతే కాకుండా, ఉపాధ్యాయులను సమాజంలో చులకన చేసే విధంగా కొత్త పథకాలు తీసుకురావడం అత్యంత బాధాకరం.ప్రస్తుతం 6 డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి.2023లో అమలు కావాల్సిన పీఆర్సీ ఇప్పటికీ కమిటీలు, అధ్యయనాల పేరుతో కాలయాపనకు గురవుతోంది.ఉపాధ్యాయుల న్యాయమైన హక్కులను వెంటనే అమలు చేయాలి.పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలి.పీఆర్సీని తక్షణమే ప్రకటించి అమలు చేయాలి.ఉపాధ్యాయుల గౌరవం, హక్కులను కాపాడాలి.ఈ పరిస్థితిని మేము పూర్తిగా వ్యతిరేకిస్తున్నాము. అని ఉపాధ్యాయులు ప్రభుత్వం పై మండిపడ్డారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు కరివేద మహిపాల్ రెడ్డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం రాష్ట్ర ఆర్గనైసింగ్ కార్యదర్శి దొడ్ల శ్రీనివాస్ రెడ్డి సిద్ధిపేట జిల్లా అధ్యక్షులు శ్రీ రామ్ శ్రీనివాస్ మెదక్ జిల్లా అధ్యక్షులు జింక అశోక్ జిల్లాల జిల్లా భాద్యులు మండల భాద్యులు పాల్గొన్నారు.



# షుగర్ పేషెంట్లు పండ్లు తినొచ్చా?

పండ్లలో కార్బొహైడ్రేట్లు ఎక్కువగా ఉంటాయి. వీటిని తిన్నప్పుడు గ్లూకోజ్ అనే షుగర్‌గా కార్బ్స్ మారతాయి. కొన్ని పండ్లలో షుగర్ ఎక్కువగా ఉంటుంది. అందుకే ఇవి తిన్నప్పుడు అది రక్తంలోకి చేరి.. బ్లడ్ షుగర్ లెవెల్స్ పెరిగేందుకు కారణం కావొచ్చు. అందుకే డయాబెటిస్ ఉన్న వారు ఎక్కువగా పండ్లు తినొచ్చా లేదా అనే సందేహం ఉంటుంది.



### పండ్లతో పాటు ఇవి కూడా..

పండ్లు తినడం వల్ల రక్తంలో షుగర్ లెవెల్స్ కాస్త పెరుగుతాయి. ఫైబర్ ఈ ప్రక్రియను తగ్గించడంలో సహకరించినా.. కాస్త షుగర్ స్థాయి అధికమయ్యే అవకాశం ఉంటుంది. హెల్దీ ఫ్యాట్స్ లేదా ప్రొటీన్ ఎక్కువగా ఉండే ఆహారాలతో పండ్లను డయాబెటిస్ ఉన్న వారు తినవచ్చని సుబ్రతా దాస్ తెలిపారు. "డయాబెటిస్ లేదా ఇన్సులిన్ రెసిస్టెంట్స్ ఉన్న వారిపై ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా గ్లైసెమిక్ ఇండెక్స్ ఎక్కువగా ఉన్న ఫుడ్స్ తిన్నాక ఇలా జరుగుతుంది. అయితే, హెల్దీ ఫ్యాట్స్ లేదా ప్రొటీన్ ఎక్కువగా ఉన్న ఆహారాలతో కలిపి పండ్లను తినడం వల్ల గ్లైసెమిక్ రెస్పాన్స్ తగ్గుతుంది. దీంతో బ్లడ్ షుగర్ లెవెల్స్ తక్కువగా ఉంటాయి. బ్లడ్ షుగర్ తటస్థంగా ఉండడం ఎక్కువగా ఫ్యాట్, ప్రొటీన్‌పై ఆధారపడి ఉంటుంది. బ్లడ్ షుగర్ స్థాయిలు స్థిరంగా ఉండేలా ప్రొటీన్ చేయగలదు. కార్బొహైడ్రేడ్ల ప్రక్రియను ఫ్యాట్ నెమ్మదయ్యేలా చేస్తుంది" అని సుబ్రదా దాస్ పేర్కొన్నారు. బాదం, ఆక్రోటు లాంటి నట్స్, సీడ్స్, పప్పు ధాన్యాలు, యగర్ట్, కోడిగుడ్లు, ఫ్యాటీ ఫిష్ లాంటి ఆహారాల్లో హెల్దీ ఫ్యాట్స్, ప్రొటీన్ ఎక్కువగా ఉంటాయి.

### హెల్దీ ఫ్యాట్స్ ఉన్న ఫుడ్స్ మేలు

ఆరోగ్యకరమైన ఫ్యాట్స్ ఉండే ఆహారాలు తినడం వల్ల చాలా ప్రయోజనాలు ఉంటాయి. "నట్స్, అవకాడో, కోడిగుడ్డు సొన, ఆలివ్ ఆయిల్ లాంటి వాటిలో హెల్దీ ఫ్యాట్స్ ఎక్కువగా ఉంటాయి. వీటి వల్ల గుండె పనితీరు మెరుగవుతుంది. ఇవి తింటే ఎక్కువసేపు ఎనర్జీ ఉంటుంది. శరీరంలో నేచురల్ హర్మోన్ కోర్టిసాల్ ఉదయం ఎక్కువగా ఉంటుంది. అప్పుడు ఈ హెల్దీ ఫ్యాట్స్ ప్రయోజనకరంగా ఉంటాయి. ఇవి తీసుకుంటే ఒత్తిడి తగ్గుతుంది. కార్బ్స్ కాకుండా ఉదయం ఫ్యాట్స్ తీసుకుంటే బ్లడ్ షుగర్ లెవెల్స్ అదుపులో ఉండేందుకు సహకరిస్తాయి. కార్బ్స్ ఎక్కువగా తీసుకుంటే ఆ లెవెల్స్ ఎక్కువవుతాయి. అందుకే డయాబెటిస్ ఉన్న వారు హెల్దీ ఫ్యాట్స్ ఉన్న ఫుడ్స్ తినడం చాలా ముఖ్యం" అని డాక్టర్ సుబ్రతా దాస్ చెప్పారు.

శరీరంలో ఇన్సులిన్ రెసిస్టెంట్‌ను, విటమిన్లు శోషించుకునే గుణాలను హెల్దీ ఫ్యాట్స్ మెరుగుపరుస్తాయని సుబ్రతా దాస్ వెల్లడించారు. పేగుల ఆరోగ్యానికి, రోగ నిరోధక శక్తికి కూడా మేలు చేస్తాయని చెప్పారు. నెయ్యి, వెన్న, కొబ్బరి నూనె, అవకాడో ఆయిల్‌లోనూ హెల్దీ ఫ్యాట్స్ ఎక్కువగా ఉంటాయన్నారు. నట్స్, నట్స్ బటర్ కూడా ఆహారంలో తీసుకోవచ్చని చెప్పారు. ఫ్రైడ్ ఫుడ్స్, కార్బొహైడ్రేట్లు ఎక్కువగా ఉండే బ్రెడ్, పాస్తా, పిజ్జా లాంటివి తినకూడదని తెలిపారు.



# చలికాలంలో ఈ నూనె వాడండి



చలికాలం అతిత్వరలో వచ్చేస్తోంది. ఇప్పటికే కాస్త చలి మొదలైంది. ఈ కాలంలో వాతావరణం చల్లగా మారిపోతుంది. దీనివల్ల చర్మ సమస్యలు ఎక్కువగా ఎదురవుతాయి. చర్మం పొడిబారడమే కాకుండా మరిన్ని ఇబ్బందులు వస్తాయి. అయితే, ఈ కాలంలో బాదం నూనె (ఆల్మండ్ నూనె) చాలా ఉపయోగపడుతుంది. అందుకే చలికాలం రాకముందే ఈ నూనెను తెచ్చిపెట్టుకోండి. చర్మానికి బాదం నూనె ఏ ప్రయోజనాలు కల్పిస్తోందో ఇక్కడ తెలుసుకోండి.

### చర్మం పొడిబారకుండా..

### మెరుపు ఉండేలా

బాదం నూనె చర్మానికి తేమను అందజేస్తుంది. చలికాలంలో చర్మాన్ని పొడిబారకుండా చేయగలదు. నిద్రపోయే ముందు చర్మానికి బాదం నూనె రాసుకోండి. ఈ నూనెలో ఫ్యాటీ యాసిడ్స్ అధికంగా ఉంటాయి. దీంతో తేమను లాక్ చేసి ఉంచుతుంది. చర్మం పొడిబారదు. చర్మం మెరుపుతో ఉంటుంది. రెండు చేతుల్లో బాదం నూనె వేసుకొని కాస్త రుద్ది ముఖానికి పూసుకోవాలి.

### కళ్ల కింద వలయాలకు..

కళ్ల కింద నల్లటి వలయాల్లా ఉండే డార్క్ సర్కిల్స్ సమస్యను ఆల్మండ్ ఆయిల్ తగ్గించదలదు. మీరు నిద్రించే ముందు ప్రతీ రోజు కళ్లు కింద ఈ నూనెను రాసుకోండి. రెండు వారాల్లోనే ఫలితం కనిపించే అవకాశం ఉంటుంది.

### ట్యాన్ తగ్గేందుకు ఇలా..

చర్మంపై కమిలినట్టుగా నల్లగా ఏర్పడే ట్యాన్ తగ్గేందుకు కూడా బాదం నూనె ఉపయోగపడుతుంది. సమాన మోతాదులో కొన్ని చుక్కల బాదం నూనె, నిమ్మ రసం, కాస్త తేనెను కలుపుకోవాలి. ఆ మిశ్రమాన్ని ట్యాన్ ఏర్పడిన చోట పూయాలి. కొన్ని రోజుల్లోనే దీని సానుకూల ప్రభావాన్ని చూడొచ్చు.

### మడమ పగుళ్లకు కూడా..

మడమ పగుళ్లకు కూడా బాదం నూనె వాడొచ్చు. పగిలిన మడమలకు ఈ నూనె రాత్రి వేళ రాయాలి. రాత్రంగా అలాగే వదిలేయాలి. ఉదయాన్నే గోరువెచ్చని నీటితో కడిగేయాలి. ఇలా చేస్తే ఏవైనా ఇన్ఫెక్షన్ ఉంటే తొలగిపోతుంది. స్కిన్ రాషెష్‌కు కూడా ఈ నూనె ఉపయోగించవచ్చు. బాదం నూనెతో ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు.

### స్ట్రెచ్‌మార్క్స్ తగ్గేందుకు..

బాదం నూనెలో విటమిన్ ఈ పుష్కలంగా ఉంటుంది. అందుకే ఈ నూనె స్ట్రెచ్‌మార్క్స్ తగ్గించగలదు. స్ట్రెచ్‌మార్క్స్ ఏర్పడిన చోట కాస్త బాదం నూనె వేసి మసాజ్ చేయాలి. స్నానం చేసిన వెంటనే ఇలా చేయాలి.

### పెదాలకు..

చలికాలంలో పెదాలు పగలడం కూడా సమస్యగా ఉంటుంది. దీనికి కూడా బాదం నూనె ఉపయోగపడుతుంది. పెదాలకు ఈ నూనె రాసుకోవాలి. పెదాలు నల్లగా కాకుండా కూడా ఈ నూనె చేయగలదు. మచ్చలను కూడా తగ్గించగలదు.



# మునక్కాడ చికెన్ కర్రీ.. ఇలా చేసుకోండి

నక్కాడ, చికెన్ కాంబినేషన్ అదిరిపోతుంది. పైగా వీటిలో పోషకాలు కూడా ఎక్కువ. ఇక ఈ రెండింటినీ కలిపి వండితే ఆ రుచి అదిరిపోతుంది. మునక్కాడ చికెన్ కాంబినేషన్లో కర్రీ వండితే ఎవరికైనా ఇట్టే నచ్చేస్తుంది. వేడివేడి అన్నంలో ఈ కూరలోని ఇగురును కలుపుకొని చూడండి. రుచి అదిరిపోతుంది. ఇందులో లేత మునక్కాయలను వాడతాము. కాబట్టి కూరకు ప్రత్యేకమైన రుచి సువాసన వస్తాయి. మునక్కాడ చికెన్ కర్రీ రెసిపీ కూడా చాలా సులువు.

### మునక్కాడ చికెన్ కర్రీ రెసిపీ

మునక్కాడలను కావాల్సిన సైజులో ముక్కలు కోసుకోవాలి శుభ్రంగా కడిగి పక్కన పెట్టుకోవాలి. చికెన్ ముక్కలను శుభ్రంగా కడిగి ఒక గిన్నెలో వేయాలి. స్టవ్ మీద కళాయి పెట్టి నూనె వేయాలి. నూనె వేడెక్కాక యాలకులు, బిర్యానీ ఆకులు, పచ్చిమిర్చి వేసి వేయించాలి. ఉల్లిపాయలను సన్నగా తరిగి నూనెలో వేసి వేయించాలి. అవి మెత్తగా ఉడికిన తరువాత పసుపు, ఉప్పు వేసి బాగా కలుపుకోవాలి.

అందులో అల్లం వెల్లుల్లి పేస్టు వేసి బాగా కలుపుకోవాలి. అందులోనే కారం, చికన్ మసాలా వేసి కలుపుకోవాలి. అందులోనే మునక్కాడ ముక్కలు వేసి బాగా కలుపుకోవాలి. అవి అయిదు



నిమిషాలు వేగాక అందులో చికెన్ ముక్కలు వేసి వేయించాలి. అరగ్లాసు నీళ్లు వేసి కలపాలి.మూత పెట్టి పావుగంట సేపు ఉడికించుకోవాలి. ఇది ఇగురులాగా అయ్యాక కొత్తిమీర తరుగు చల్లుకోవాలి. ఈ మునక్కాడ చికెన్ కర్రీని అన్నంతో తిన్నా, చపాతీతో తిన్నా టేస్టీగానే ఉంటుంది.

| కావాల్సిన పదార్థాలు |
|---|
| మునక్కాయలు - రెండు |
| చికెన్ - అర కిలో |
| టమోటాలు - రెండు |
| ఉల్లిపాయలు - రెండు |
| పచ్చిమిర్చి - నాలుగు |
| చికెన్ మసాలా - రెండు స్పూన్లు |
| కారం పొడి - రెండు స్పూన్లు |
| ఉప్పు - రుచికి సరిపడా |
| పసుపు - పావు స్పూను |
| యాలకులు - రెండు |
| బిర్యానీ ఆకులు - రెండు |
| కొత్తిమీర తరుగు - రెండు స్పూన్లు |





ఇటీవల వివాహేతర సంబంధాలు పెరిగిపోయాయి. దీని కారణంగా దాంపత్య జీవితంలో ఎన్నో సమస్యలు వస్తున్నాయి. అలాగే ఆ బంధం విడాకుల వరకు వెళ్తుంది. అయితే పురుషులు, స్త్రీలు ఇతరుల వైపు ఎందుకు చూస్తారు? భర్త స్త్రీ మోజులో పడడం, భార్య ఇతర పురుషుడి మైకంలో పడడానికి కారణం చాణక్యుడు వెల్లడించారు. ఆ కారణాలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం.

# భర్తలూ.. ఈ తప్పులు అసలు చేయకండి

**శారీరక సంతృప్తి**

వివాహ బంధం బలంగా ఉండాలంటే భార్య, భర్తలకు శారీరక సంతృప్తి అనేది చాలా ముఖ్యం. వివాహబంధంలో మీరు మానసికంగా బలంగా ఉన్నా, శారీరక సంతృప్తి లేకపోతే ఆ బంధంలో కల్లోలం తప్పదని చాణక్యుడు వెల్లడించారు. దంపతులు ఒకరినొకరు అర్థం చేసుకోవడానికి, ఒకరికి ఒకరం ఉన్నామని భావన కలగాలంటే శారీరకంగా కలవడం తప్పనిసరి అని పేర్కొన్నారు. శారీరక సంతృప్తి లేకపోతే స్త్రీ, పురుషులకు ఇతరులవైపు ఆకర్షితులవుతారని, అలా వారి మధ్య దూరం పెరుగుతుందని వివరించారు.



**చిన్న వయసులో పెళ్లి..**

చాలా మందికి చిన్న వయసులోనే పెళ్లిళ్లు చేస్తూ ఉంటారు. ఆ వయసులో పెళ్లి చేయడం వల్ల వివాహ బంధంలో సమస్యలు వస్తాయట. చిన్న వయసులో పెళ్లి చేయడం వల్ల.. భార్య భర్తలకు వివాహబంధం పై ఎలాంటి అవగాహనా ఉండదట. ఈ వయసులో వారు కోరికలపై శ్రద్ధ చూపుతారని, దీంతో వేరే వ్యక్తుల వైపు ఆకర్షితులవుతారని పేర్కొన్నారు. దీంతో పాటు చిన్న వయసులోనే పెళ్లి చేసుకోవడం వల్ల బాధ్యతల నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నిస్తూ ఉంటారు. తద్వారా భాగస్వామితో గొడవలు మొదలై విడాకుల వరకు వెళ్తుందని చెప్పారు.

**నమ్మకం..**

ఏ బంధం అన్నా బలంగా ఉండాలంటే, ఎలాంటి గొడవలు లేకుండా బంధం కొనసాలాగంటే ఒకరిపై ఒకరికి నమ్మకం అనేది ఉండాలి. ముఖ్యంగా వివాహబంధంలో దంపతుల నమ్మకం చాలా ముఖ్యం. ఒకవేళ దంపతుల మధ్య నమ్మకం లేకపోతే వారిద్దరి మధ్య ప్రేమ ఉండదు, అనుమానం మాత్రమే ఉంటుంది. అందుకే భార్య, భర్తల మధ్య నమ్మకం ఉండాలంటున్నారు. లేకపోతే విడాకులు తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుందని చెబుతున్నారు.

మార్పు..

మీకు నచ్చిన అమ్మాయికి ఎలా ప్రపోజ్ చేయాలి? ఎక్స పర్ట్ టిప్స్ "మీకు నచ్చిన అమ్మాయికి ఎలా ప్రపోజ్ చేయాలి? ఎక్స పర్ట్ టిప్స్ "

దంపతులు ఇద్దరూ తల్లిదండ్రులు అయ్యేంత వరకు వారి మధ్య ప్రేమ అమితంగానే ఉంటుంది. సాధారణంగా మనం ఇది చూస్తూనే ఉంటాం. అయితే పిల్లలు పుట్టిన తరువాత ఇద్దరు తమ ప్రేమను పిల్లలపైనే చూపిస్తూ ఉంటారు. మరీ ముఖ్యంగా భార్య తన ప్రేమను పిల్లలపైనే చూపించడంతో పురుషుడు వేరే స్త్రీవైపు ఆకర్షితుడు అవుతాడని, తద్వారా బంధంలో ఎడబాటు మొదలవుతుందని చెప్పుకొచ్చారు.

**సమయం కేటాయించకపోవడం**

భార్య భర్తల మధ్య దూరం తగిన సమయం కేటాయించకపోవడం వల్ల కూడా పెరుగుతుంది. భార్య భర్తలు ఎప్పుడైతే తమ భాగస్వామికి తగిన సమయం కెటాయించరో అప్పుడు వారి మధ్య గొడవలు మొదలవుతాయని, అవి క్రమంగా ద్వేషంగా మారుతాయంటున్నారు. అందుకే భార్య భర్తలు ఇద్దరూ తమ భాగస్వామికి తగినంత సమయం కేటాయించాలని, లేకపోతే వివాహ బంధం తప్పనిసరిగా వివాహేతర బంధం వైపు అడుగులు వేస్తుందని నీతిశాస్త్రంలో ఉంది.





# బుల్లెట్ కాఫీతో ఇన్ని లాభాలా?

నెయ్యి కాఫీ.. దీనిని బుల్లెట్ ప్రూఫ్ కాఫీ అని కూడా పిలుస్తారు. ఇది నెయ్యి లేదా శుద్ధం చేయబడిన వెన్నతో తయారు చేస్తారు. దీనికి మన దేశంలో చాలా డిమాండ్ ఉంది. ఈ రిచ్ కాఫీ స్థిరమైన శక్తిని తక్షణమే అందిస్తుంది. మన కాన్సంట్రేషన్‌ను మెరుగుపరుస్తుంది. అలాగే బరువు తగ్గడానికి ఎంతగానో సహాయపడుతుంది. ఇంతటి ఆరోగ్య ప్రయోజనాలు ఉన్న ఈ కాఫీని ఇంట్లోనే చేసుకోవచ్చు. దీనిని ఇంట్లోనే ఎలా చేసుకోవాలి? ఈ టీ తాగితే ఎలాంటి లాభాలు వస్తాయి అనేది ఈ స్టోరీలో పూర్తిగా వివరించాము. ఒక్కసారిగా ఈ స్టోరీని చూద్దాం రండి.. నెయ్యిలోని ఆరోగ్యకరమైన కొవ్వులు కెఫీన్ విడుదలను నెమ్మదిస్తాయి. దీని కారణంగా ఈ కాఫీ తాగిన వారికి రోజంతా శక్తి లభిస్తుంది. సాధారణ కాఫీలు కలిపించే అడ్డంకులు ఈ కాఫీ కలిపించదు. ఈ నెయ్యి కాఫీలో కీటో కార్బ్ డైట్‌లు తక్కువగా ఉంటాయి. దీంతో ఈ టీని తాగడం వల్ల.. శరీరంలోని కొవ్వు కరిగిపోతుంది. ఆ కొవ్వును కరిగించేందుకు ఈ బుల్లెట్ ప్రూఫ్ కాఫీ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఎందుకంటే నెయ్యిలోని ఆరోగ్యకరమైన కొవ్వులు మీ శరీరానికి స్థిరమైన శక్తి అందిస్తాయి మరియు కీటోసిస్‌ను ప్రోత్సహిస్తాయి. నెయ్యి కాఫీ వారి ఏకాగ్రతను మరియు మానసిక స్పష్టతను మెరుగుపరచడంలో సహాయపడుతుందని, మరియు ప్రొడక్టివిటీని పెంపొందించడంలో ఇది అమోఘంగా పని చేస్తుందని పలు నివేదికల్లో వెల్లడైంది కూడా. నెయ్యిలో బ్యూటిరేట్ అనే కొవ్వు ఆమ్లం ఉంటుంది, ఇది గట్ ఆరోగ్యానికి మేలు చేస్తుంది, ఈ కాఫీని గట్‌ఫ్రెండ్లీగా కూడా పిలుస్తుంటారు. నెయ్యిలో ఆరోగ్యానికి అవసరమైన ఎ, డి, ఇ, కె వంటి విటమిన్స్ ఉంటాయి. ఇవి సులువుగా కొవ్వులో కరిగిపోతాయి.

**ఇంట్లోనే నెయ్యి కాఫీ ఎలా తయారు చేసుకోవాలి?**

ఇంట్లో నెయ్యి కాఫీ తయారు చేయడం చాలా సులభం. ఈ కాఫీని ఇంట్లోనే ఎలా చేసుకోవాలి దానికి పదార్థాలు ఏంటి అనేది కింద వివరించాము పూర్తిగా చదవండి. మీకు నచ్చిన పద్ధతిని ఉపయోగించి ఒక కప్పు బ్లాక్ కాఫీని తయారు చేసుకోవాలి. అనంతరం ఆ వేడి వేడి బ్లాక్ కాఫీని ఒక బ్లెండర్‌లో పోయాలి. ఆ బ్లెండర్‌లో ఒక టేబుల్ స్పూన్ నెయ్యి కలపాలి. కావాలనుకునేవారు అదనంగా పాల క్రీమ్ కూడా వేసుకోవచ్చు. బ్లెండర్‌లో వేసుకున్న తరువాత కాఫీ స్మూత్‌గా, నురువు వచ్చేంత వరకు సుమారు 20 నుంచి 30 సెకన్ల పాటు బ్లెండ్ చేసుకోవాలి. అనంతరం ఆ కాఫీని ఒక గ్లాస్‌లో తీసుకొని దానికి రుచికి తగ్గట్టు స్టెవియా లేదా మాంక్ ఫ్రూట్ జ్యూస్‌ను కలిపుకుంటూ మంచిగా ఆ కాఫీని ఆనందించొచ్చు. ఈ కాఫీతో అనేక సమస్యలు తీరిపోవడంతో పాటు సమస్యలన్నీ దూరం అవుతాయి.



# ఉడిపి సాంబార్.. ఇంట్లోనే చేసుకోండిలా..!

ఉడిపి హోటల్స్ లో సాంబార్ చాలా మందికి ఫేవరెట్. కానీ ఎంత ట్రై చేసినా ఇంట్లో ఆ టేస్ట్ రాదు. ఆ సాంబార్.. ఇడ్లీ, వడ, దోశ ఇలా ఏ టిఫిన్ లోకైనా అదిరిపోతుంది. ఈ సాంబార్ కు ప్రపంచవ్యాప్తంగా ఫ్యాన్స్ ఉన్నారు. ఈ సాంబార్ కొద్దిగా తిపీగా, కొద్దిగా కారంగా, పుల్లగా ఘుమఘుమలాడూ నోరూరిస్తుంది. ఉడిపి సాంబార్ ఎలా తయారు చేసుకోవాలో చూద్దాం.

## కావాల్సిన పదార్థాలు:

- ★ నూనె 2 టేబుల్ స్పూన్లు
- ★ ఉల్లిపాయ 1 (తరిగినది)
- ★ పచ్చిమిర్చి 10 (పొట్టు తీసినవి)
- ★ టొమాటోలు 2 (తరిగినవి)
- ★ కరివేపాకు కొద్దిగా
- ★ పచ్చిమిర్చి 2 (పొడవుగా కోసుకోవాలి)
- ★ ఉప్పు రుచి ప్రకారం
- ★ పసుపు పొడి 1 టేబుల్ స్పూన్
- ★ చింతపండు రసం 23 టేబుల్ స్పూన్లు
- ★ బెల్లం 1 టేబుల్ స్పూన్
- * కొత్తిమీర కొద్దిగా

## పప్పు కోసం...

- ★ కంది పప్పు 1 కప్పు(పసుపు కందిపప్పు లేదా ఎర్ర కందిపప్పు)
- ★ పసుపు పొడి 1 టేబుల్ స్పూన్
- ★ నీరు 3 కప్పులు

## సాంబార్ మసాలా కోసం...

- ★ మిరపకాయలు 68
- ★ కొత్తిమీర గింజలు 5 టేబుల్ స్పూన్లు
- ★ చిక్ పీస్ 2 టేబుల్ స్పూన్లు
- ★ ఉరుతం పప్పు 2 టేబుల్ స్పూన్లు
- ★ జీలకర్ర 1 1/2 tsp
- ★ మెంతులు 1 టేబుల్ స్పూన్
- ★ కొబ్బరి 4 టేబుల్ స్పూన్లు (తురిమినవి)
- ★ నూనె 1 టేబుల్ స్పూన్

## సాంబారు కోసం కూరగాయలు...

- ★ క్యారెట్ 1 (తరిగినది)
- ★ మునగకాయ 2 (తరిగినవి)
- ★ బంగాళదుంప 1 (తరిగినది)
- ★ పసుపు గుమ్మడికాయ లేదా సొరకాయ 1 కప్పు (తరిగినది)
- ★ బెండకాయ ముక్కలు 1/2 కప్పు (తరిగిన)
- ★ వంకాయలు 3 (తరిగినవి)
- ★ బీన్స్ 5 (తరిగినవి)

## మసాలా కోసం...

- ★ నూనె/నెయ్యి 2 టేబుల్ స్పూన్లు
- ★ ఆవాలు 1 టేబుల్ స్పూన్
- ★ ఉద్దిపప్పు 1 టేబుల్ స్పూన్
- ★ జీలకర్ర 1 టేబుల్ స్పూన్
- ★ శెనగపప్పు 1 టేబుల్ స్పూన్
- ★ కరివేపాకు కొద్దిగా
- ★ ఇంగువ పొడి 1 టేబుల్ స్పూన్

## తయారుచేయు విధానం:

★ ముందుగా ఎర్ర కంది పప్పును నీళ్లతో బాగా కడిగి కుక్కర్‌లో వేసి, 3 కప్పుల నీళ్లు పోసి, పసుపు వేసి ఓవెన్‌లో ఉంచి, కుక్కర్‌ను మూతపెట్టి, 3 విజిల్స్ వచ్చేలా చేసి, తక్కువ మంట మీద ఉంచి, అది 5 నిమిషాలు ఉడకనివ్వండి. విజిల్ వచ్చిన తర్వాత కుక్కర్ తెరిచి పప్పును మెత్తగా చేయాలి. తర్వాత సాంబార్ మసాలా సిద్ధం చేసుకోవాలి. అందుకోసం స్టౌ మీద పాన్ పెట్టి అందులో 1 టీస్పూన్ నూనె పోసి వేడి అయ్యాక సాంబార్ మసాలా కోసం ఇచ్చిన పదార్థాలను ఒక్కొక్కటిగా వేసి బంగారు రంగు వచ్చేవరకు వేయించి చల్లారనివ్వాలి. తర్వాత దీన్ని మిక్సీ జార్‌లో వేసి కాస్త నీళ్లు పోసి బాగా గ్రైండ్ చేసి పక్కన పెట్టుకోవాలి. తర్వాత స్టౌ మీద వెడల్పాటి పాన్ పెట్టి అందులో 2 స్పూన్ల నూనె పోసి వేడయ్యాక ఉల్లిపాయలు, చిన్న ఉల్లిపాయలు, పచ్చిమిర్చి, టమాటా, కరివేపాకు వేసి 2 నిమిషాలు బాగా వేగించాలి. తర్వాత అందులో పైన పేర్కొన్న కూరగాయలను వేసి, కాస్త ఉప్పు చల్లి, పసుపు వేసి పచ్చి వాసన పోయే వరకు 5 నిమిషాలు వేయించాలి. తర్వాత అందులో నీళ్లు పోసి మూత పెట్టి కూరగాయలను 10 నిమిషాలు బాగా ఉడకనివ్వాలి. కూరగాయలు బాగా ఉడికిన తర్వాత అందులో ఉడికించిన పప్పు, రుబ్బిన సాంబార్ మసాలా, చిటికెడు బెల్లం మరియు చింతపండు రసం వేసి బాగా కలిపి, రుచికి సరిపడా ఉప్పు వేసి, తక్కువ మంట మీద ఉంచి 1015 నిమిషాలు ఉడకనివ్వండి. చివరగా స్టౌ మీద మరో పాన్ పెట్టి అందులో నూనె/నెయ్యి వేసి వేడయ్యాక అందులో ఆవాలు, ఉద్దిపప్పు, శెనగపప్పు, జీలకర్ర, కరివేపాకు, ఇంగువ పొడి వేసి బాగా వేగించి సాంబారులో పోసి పైన కొత్తిమీర చల్లి తిప్పితే ఉడిపి సాంబార్ రెడీ.





The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.